RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 225 ISSUE NO : 225 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | మంగళవారం, మార్చి,3, 2026 Tuesday, March,3, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



## యుద్ధ వాతావరణం మరింత ముదురుతున్న వేళ

# గల్ఫ్ దేశాధినేతలకు ప్రధాని మోడీ ఫోన్

**న్యూఢిల్లీ,మార్చి,02:** యుద్ధ వాతావరణం మరింత ముదురుతున్న వేళ గల్ఫ్ దేశాధి నేతలకు ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్ చేశారు. ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై చర్చించారు. ఈ సందర్భంగా గల్ఫ్ దేశాల నేతలకు కీలక సూచనలు చేశారు. పశ్చిమాసి యాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు అత్యంత ఆందోళనకరమని పేర్కొన్న మోడీ, భారత్ ఎప్పుడూ శాంతినే కాంక్షిస్తుందని స్పష్టం చేశారు. "ఎటువంటి వివాదాలనైనా దౌత్య పరమైన చర్చల ద్వారానే పరిష్కరిం చుకోవాలని భారత్ గట్టిగా విశ్వసిస్తుంది" అని ఆయన పునరుద్ఘాటిం చారు. ఈ క్లిష్ట సమయంలో అన్ని పక్షాలు సంయమనం పాటించాలని ఆయన కోరారు. యుద్ధ మేఘాలు కమ్ముకున్న ప్రాంతాల్లో ఉన్న వేలాది మంది భారతీయ పౌరుల భద్రత గురించి ప్రధాని ప్రస్తావించారు. వారి క్షేమాన్ని పర్యవేక్షించేం దుకు మరియు రక్షణ కల్పించేందుకు ఆయా దేశాలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, భారతీయుల భద్రత తమ ప్రథమ ప్రాధాన్యత అని ఆయన వెల్లడిం చారు.ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న ఉగ్రవాదం కేవలం భారత్, కెనడాలకే కాకుండా మొత్తం మానవాళికే పెను సవాలుగా మారిందని ప్రధాని మోడీ అభిప్రాయపడ్డారు. వీటిని అణచివేసేందుకు ప్రపంచ దేశాలన్నీ ఏకం కావాలని వారు పిలుపునిచ్చారు.

## డీసీసీ అధ్యక్షులకు రాహుల్

# మార్షల్ ఆర్ట్స్ క్లాస్...



## కాంగ్రెస్ పార్టీని శివుడితో

# పోల్చిన రాహుల్..

## హైదరాబాద్ చేరుకున్న రాహుల్ గాంధీ.. ఘన స్వాగతం పలికిన సీఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి,02,తెలంగాణ దిశ :** లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇవాళ ఉదయం హైదరాబాద్ చేరుకున్నారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానా శ్రయానికి చేరుకున్న ఆయనకు సీఎం రేవంత్ రెడ్డి ఘన సాగతం పలికారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్టు బయట కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివచ్చి రాహుల్ గాంధీ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. ఈ మేరకు శంషాబాద్ నుంచి రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఒకే కారులో వికారాబాద్‌కు బయలుదేరనున్నారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రాంగణంలో జరగనున్న పీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ సమావేశంలో రాహుల్, రేవంత్ పాల్గొంటారు. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పార్టీ బలోపేతంపై ఈ సమావేశంలో చర్చిం చనున్నారు. ఆతర్వాత అనంతగిరి హిల్స్‌లోని హరిత హోటల్‌లో గత కొన్ని రోజులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుల శిక్షణా తరగతులు జరుగుతున్నాయి. ఈ శిక్షణా తరగతుల ముగింపు సమావేశానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరై, రెండు రాష్ట్రాల పార్టీ ప్రతినిధులకు దిశానిర్దేశం చేయనున్నారు. అయితే, రాహుల్ గాంధీ పర్యటన నేపథ్యంలో వికారాబా ద్, అనంతగిరి హిల్స్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు భారీ




భద్రతను ఏర్పాటుచేశారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణకు రావడం, ముఖ్యంగా రెండు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులతో భేటీ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాహుల్ రాకతో కాంగ్రెస్ కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నెలకొంది.

## ఇరాన్‌లో పాలకులను మార్చేందుకు

# యుద్ధం చేయలేదు

## అమెరికా రక్షణశాఖ ప్రకటన




**వాషింగ్టన్,మార్చి,02:** యుద్ధంపై అమెరికా రక్షణశాఖ( కీలక ప్రకటన చేసింది. 'మేము ఇంకా యుద్ధం ప్రారంభించలేదు.. అయినా ముగింపు పలికేందుకు సిద్ధంగానే ఉన్నాం. మేము ఎన్నిసార్లు హెచ్చరించినా ఇరాన్ మొండిగానే ప్రవర్తించింది. అణ్వాయుధాల తయారీని కొనసా గిస్తూనే వచ్చింది. కనీసం ఖమేని మా హెచ్చరికలను కూడా లెక్కచేయ లేదు. పైగా అమెరికా, ఇజ్రాయెల్‌కు ఇరాన్ చేతిలో చావు తప్పదని అన్నారు. తీరా చూస్తే యుద్ధంలో ఖమేని చనిపోయారు. ఈ యుద్ధం కారణంగా ఇరుపక్షాలకు భారీ నష్టం జరుగుతోంది.మేము ఇరాన్‌లో పాలకులకు మార్చేందుకు యుద్ధం చేయడం లేదు. కేవలం అణ్వాయుధాలను అంతం చేసేందుకే యుద్ధం చేశాం. ఇక ఇది సరైంది కాదు అనిపిస్తోంది' అని అమెరికా రక్షణశాఖ ప్రకటనలో పేర్కొంది.

## ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ దాడులు

# రాష్ట్రాలను అప్రమత్తం చేసిన కేంద్రం

**న్యూఢిల్లీ,మార్చి,02:** ఇజ్రాయెల్, అమెరికా–ఇరాన్ దాడులు, ఇరాన్ సుప్రీం ఖమేనీ మృతి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. యుద్ధవాతావరణం నేపథ్యంలో భారతదేశంలో మతపరమైన అల్లర్లు జరిగే అవకాశం ఉందని అందువల్ల అలర్ట్ గా ఉండాలని ఈ మేరకు కేంద్ర హోం శాఖ రాష్ట్రాల పోలీసు శాఖలకు లేఖ రాసింది. ముఖ్యంగా మతపరమైన సభలు, ప్రార్థనా స్థలాలలో ఇరాన్ అనుకూల రాడికల్ బోధకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసే అవకాశం అటువంటి వాటిపైని ఘా ఉంచాలని ఆదేశించింది. దేశీయం గా శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, గూఢచారి విభాగాలమధ్య సమన్వయాన్ని పెంచి, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. ఖమేనీ మృతికి నిరసనగా భారత్‌లోని ముఖ్యమైన నగరాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయి. హైదరాబాద్, కర్నాటక, ఢిల్లీ, యూపీతో పాటు పలు ముఖ్యమైన నగరాల్లో




ఖమేనీమృతిపై ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈనిరసనలను ఆసరాగాచేసుకుని కొంతమంది హింసాత్మక ఘటనలకు దారితీసేలా రెచ్చగొట్టే అవకాశంఉందని, దీనిని అదుపు చేయాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈనేపథ్యంలో ముందస్తుగా జాగ్రత్త వహించాల ంటూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలనుఅప్రమత్తం చేసింది.ఇదిలా ఉంటే పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై కేంద్ర ప్రభుత్వం అలర్ట్ గా ఉంది అక్కడి పరిస్థితులపై గత రాత్రి ప్రధాని మోడీ నేతృత్వంలో భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సీసీఎస్)సమీక్షించింది.

## ఇరాన్ సుప్రీం లీడర్

# ఖమేనీ భార్య మృతి..



## కుటుంబంలో భారీ ప్రాణనష్టం!

**న్యూఢిల్లీ,మార్చి,02:** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన మరుసటి రోజే ఆయన భార్య మన్సూరే ఖోజస్తే బాఘెర్జాదే (79) తుదిశ్వాస విడిచారు. ఇటీవల టెహ్రాన్‌లోని సుప్రీం లీడర్ కార్యాలయంపై అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన భారీ వైమానిక దాడిలో ఆమె తీవ్రంగా గాయపడినట్లు తెలిసింది. ఆసుపత్రిలో చికిత్స పొం దుతూ ఆమె మరణించినట్లు ఇరాన్ ప్రభుత్వ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ వైమానిక దాడి కేవలం సుప్రీం లీడర్‌ను మాత్రమే కాకుండా, ఆయన కుటుంబాన్ని కూడా చిన్నాభిన్న ం చేసింది. తాజా నివేదికల ప్రకారం, ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, ఒక మనవడు, కోడలు, అల్లుడు కూడా అదే దాడిలో ప్రాణాలు కోల్పోయి నట్లు తెలుస్తోంది. ఖమేనీ దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వీరిలో మొజ్తబా ఖమేనీ రాజకీయంగా అత్యంత కీలక వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఒక ప్రముఖ వ్యాపార కుటుంబంలో జన్మించిన మన్సూరే, 1964లో అలీ ఖమేనీని వివాహం చేసుకున్నారు.

## అన్నారం బ్యారేజీని కూల్చేందుకు

# కుతంత్రాలు..

## కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ధ్వజం

**హైదరాబాద్,మార్చి,02,తెలంగాణ దిశ :** మేడిగడ్డ బ్యారేజీపై కుట్రలు చేసింది చాలదన్నట్టు ఇప్పుడు అన్నారం బ్యారేజీని కూల్చేందుకు కుతంత్రాలకు తెరతీశారా? అని కాంగ్రెస్ పార్టీనిబీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. అన్నారం బ్యారేజీ వద్ద లారీల్లో ఇసుకతరలిస్తున్న వీడియోపై ఎక్స్‌వేదికగా ఆయన స్పందించారు. నిబంధనలకు పాతరేసి ఏకంగా బ్యారేజీ కిందే భారీ ఎక్సవేటర్లతో ఇసుక తవ్వకాలుజరపడం దుర్మార్గమే కాదు.. అతిపెద్ద నేరం. అన్నారు. బ్యారేజీ సమీపంలో ఇసుక తవ్వకాలు చేపట్టకూడదన్న రూల్స్ ను బ్రేక్ చేసిన మాఫియాపై వెంటనే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. ఏకంగా బ్యారేజీనిబలహీనపరిచి బీఆర్ఎస్‌పై బురదజల్లే పన్నా గాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. అందినకాడికి దోచుకో.. దొరికినకాడికి అమ్ముకో.. ఇవే తెలంగాణలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా పాలన సూత్రాలు అని ఎద్దేవా చేశారు. తెలంగాణ వరప్రదాయిని కాళేశ్వరం ప్రాజెక్టును దెబ్బతీసేందుకు నాటి నుంచి నేటి వరకు కాంగ్రెస్ చేస్తున్న అరాచకపర్వాన్ని అన్నదాతలు క్షమించే ప్రసక్తే లేదని నిబంధనలు తుంగలో తొక్కి అన్నారం బ్యారేజి పిల్లర్ల వద్ద ఇసుక తవ్వకాలు చేసి రేవంత్ సర్కార్ బ్యారేజీని ప్రమాదంలోకి నెడుతుందన్నారు. పట్టపగలే, నిస్సిగ్గుగా అన్నారం బ్యారేజ్ నుండి కాంగ్రెస్ నాయకుల ఇసుక మాఫియా ఇసుకను తోడేస్తోందని ఆరోపించారు. తెలంగాణ వనరులను కాంగ్రెస్ పార్టీ ఎలా కొల్లగొడుతుం దో చెప్పడానికి ఇది ప్రత్యక్ష ఉదాహరణ ఇదన్నారు.



## ఇప్పటిదాకా ఒక లెక్క..

# ఇకపై మరో లెక్క: బండి

**కరీంనగర్,మార్చి,02,తెలంగాణ దిశ :** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రక్షాళనకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ నడుంబిగించారు. అందులో భాగంగా సోమవారం కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో కలిసి కరీంనగర్ ఎంపీ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగం డీసీపీ, ఏసీపీలుసహా సిబ్బంది అంతా హాజరైన ఈ సమావేశంలో "ఇప్పటిదాకాఒకలెక్క. ఇకపై మరో లెక్క. ఇళ్ల నిర్మాణాలకుఅనుమతుల కోసండబ్బులు అడగొద్దు..బాధితులను ఇబ్బంది పెట్టొద్దు. అవినీతికి తావు లేకుండా ఇంటి అనుమతుల కోసం వచ్చే ప్రజలకు సులువుగా అనుమతి ఇచ్చేలా చేయాల్సిందే. బ్రోకర్ల ద్వారా ఏజెన్సీల ను పెట్టుకుని ప్రజలను వేధిస్తూ లంచాలు తీసుకుని అనుమతి ఇవ్వాలనుకుంటే మాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదు.అలాంటి వాళ్లు ఎవరైనా ఉంటే వెంటనే బదిలీపై వెళ్లవచ్చు. నిజాయి తీగా రూల్స్ ప్రకారం పనిచేసే వాళ్లపై మా రాజకీయ ఒత్తిళ్లు ఉండవు. వాళ్లపై ఈగ కూడా వాలనివ్వను. కంటికి రెప్పలా కాపాడుకుంటా" అని స్పష్టం చేశారు. మిమ్మల్ని బెదిరించడానికో, భయపెట్టడానికో పిలవ లేదు. పూర్తి పారదర్శకతో పనిచేయాలి. మీరు నిజాయితీగా, నిబంధనల ప్రకారం పనిచేస్తూ ఇంటి పర్మిషన్ల కోసం మీ వద్దకు వచ్చే ప్రజలకు సు లువుగా అనుమతి ఇచ్చే విషయంలో మీకు పూర్తిగా స్వేచ్ఛనిస్తున్నా. మీరు తప్పు చేస్తే భగవంతుడు కూడా మిమ్మల్ని కాపాడలేరు.



# నాంపల్లిలో టీఎన్జీఓ యూనియన్ డైరీ, క్యాలెండర్--2026 ఆవిష్కరణ







**హైదరాబాద్, మార్చి 02, తెలంగాణ దిశ** : తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డైరీ మరియు క్యాలెండర్--2026 ఆవిష్కరణ కార్యక్రమం హైదరాబాద్ నాంపల్లిలోని యూనియన్ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు బి. రవి ప్రకాష్ అధ్యక్షత వహించారు. కేంద్ర సంఘ గౌరవ అధ్యక్షులు మారాం జగదీష్, ప్రధాన కార్యదర్శి ఎస్. ముజీబ్ హుస్సైని ముఖ్య అతిథులుగా విచ్చేసి డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారికి సంఘం తరపున ఘన సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల ఐక్యతే సంఘ బలం అని పేర్కొన్నారు. 2026 సంవత్సరంలో ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, పెండింగ్ సమస్యల పరిష్కారానికి సంఘం కట్టుబడి పనిచేస్తుందని తెలిపారు. సేవాభావంతో సమిష్టిగా ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. అదే కార్యక్రమంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల పోస్టర్‌ను కూడా ఆవిష్కరించారు. మార్చి 6వ తేదీన ఉదయం 10 గంటలకు కోటి లోని ఉస్మానియా మెడికల్ కళాశాల సభా మందిరంలో నిర్వహించ తలపెట్టిన మహిళా దినోత్సవ కార్యక్రమానికి మహిళా ఉద్యోగినులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. మహిళల సాధికారత, పరిపాలనలో వారి విశిష్ట పాత్రను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షులు శామ్యూల్ పాల్, కార్యదర్శి బి. భరత్ కుమార్, కోశాధికారి శేష సాయి గిరికాంత్, అసోసియేట్ అధ్యక్షులు కె. వెంకటేశ్వర్లు, సెంట్రల్ పబ్లిక్ సెక్రటరీ శైలజ, హైదరాబాద్ సిటీ అధ్యక్షులు శ్రీకాంత్, జిల్లా అధ్యక్షులు విక్రమ్, జిల్లా కార్యదర్శి కటారి శ్రీనివాస్, గ్రౌండ్ వాటర్ ఫోరం అంజనా, సెంట్రల్ ఫోరం ఉపాధ్యక్షురాలు ఉమాదేవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరుణ్ కుమార్, జేమ్స్ దాస్, రజని, అశ్విని, కొండల్ రావు, కె. వేణుగోపాల్, కార్తిక్, ఎల్. అక్షయ్ కుమార్, శ్రీనివాస్, ఎస్. అరుణ, రవి యాదవ్, షాలీ పాహివామ్, నసీమ, సత్య జ్యోతి, రవీందర్, మాణిక్యం, సంజయ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్ రెవెన్యూ కార్యాలయం పై ఏసీబీ దాడులు

### - లంచం తీసుకుంటున్న వీఆర్ ఓ అరెస్ట్





కుత్బుల్లాపూర్ మార్చి 02, (తెలంగాణ దిశ) :కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ జారీ కోసం చేయడం కోసం రూ. 20వేల లంచం అడిగిన గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్ ఓ)ను సోమవారం ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. అతనిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఏసీబీ అధికారుల వివరాల ప్రకారం కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే విఆర్ఓ జి. గణేష్ వద్దకు స్థానిక వ్యక్తి ఒకరు కొద్ది రోజుల క్రితం వచ్చి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలని వివరాలు అందించాడు.
అయితే ఆ సర్టిఫికెట్ ఇవ్వాలంటే రూ. 20 వేల లంచం ఇవ్వాలని గణేష్ డిమాండ్ చేశారు. 5000 రూపాయలు తీసుకున్న గణేష్ మిగతా బ్యాలెన్స్ రూ. 15 వేలు ఇస్తేనే ఫ్యామిలీ సర్టిఫికెట్ ఇస్తానంటూ బేరం పెట్టాడు. దీంతో బాధితుడు అవినీతి నిరోధక శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు సోమవారం ఉదయం బాధితుడు నుంచి రూ. 15 వేలు లంచం
తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్ గా రైడ్ చేసి వీఆర్ ఓ గణేష్ ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరు లంచాలు అడిగినా టోల్ ఫ్రీ నెంబర్ 1064 నెంబర్ కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏసీబీ దాడులు చేయడంతో కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది భయభ్రాంతులకు గురయ్యారు.

# కుషాయిగూడలో ఇంటి దొంగతనం కేసు ఛేదించిన పోలీసులు

### - రూ.10.20 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు స్వాధీనం
### - తన వద్ద పని చేసే వ్యక్తే నిందితుడు

**కుషాయిగూడ, మార్చి 02, (తెలంగాణ దిశ)** :మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న భారీ ఇంటి దొంగతనం కేసును పోలీసులు వేగంగా ఛేదించారు. నిందితుడిని అరెస్టు చేసి, దొంగిలించిన సుమారు రూ. 10.20 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు, నగదును స్వాధీనం చేసుకున్నారు. కుషాయిగూడ డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారు జూపూడి ఆనంద్ గుప్తా (55), వ్యాపారి, కుషాయిగూడ నివాసి. 28న ఉదయం సుమారు 11.30 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి బంధువుల ఫంక్షన్‌కు వెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి ఇంటి ప్రధాన తలుపు తాళం తెరిచి ఉండడం గమనించారు. లోపలికి వెళ్లి చూడగా అల్మరాలు తెరచి ఉండడం, బంగారు పెట్టెలు నేలపై చెల్లాచెదురుగా పడివుండడం గుర్తించారు.



పరిశీలించగా సుమారు 38.3 తులాల బంగారు ఆభరణాలు, 3.7 కిలోల వెండి వస్తువులు, నగదు రూ. 2.45 లక్షలు కలిపి మొత్తం రూ. 10.80 లక్షల విలువైన సొత్తు మాయం అయినట్లు తేలింది. ఫిర్యాదు మేరకు క్రైమ్ నం. 165/2026 కింద బిఎన్ఎస్ సెక్షన్లు 331(3), 305 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సమగ్ర విచారణలో భాగంగా పోలీసులు సోమవారం నిందితుడు తమ్మిమేని తిరుపతి రెడ్డి అలియాస్ మహిదర్ గుప్తా (28), ప్రైవేట్ ఉద్యోగి, కుషాయిగూడ నివాసిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో అతనే ఫిర్యాదుదారుడి వద్ద పనిచేసే వ్యక్తి అని తేలింది. కారు ట్రావెల్స్ వ్యాపారం ప్రారంభించేందుకు కారు కొనుగోలు చేయాలని నిందితుడు యోచించాడు. డబ్బు అవసరమవడంతో ఐదు రోజుల ముందే ఇంటి డూప్లికేట్ తాళం తయారు చేయించుకొని, కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో పథకం ప్రకారం దొంగతనం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు నిందితుడి వద్ద నుంచి వివిధ బంగారు ఆభరణాలు (కాసుల హారం, చైన్‌లు, ఉంగరాలు, నెక్లెస్‌లు, బ్రాస్లెట్‌లు, గోల్డ్ బిస్కెట్ మొదలైనవి), సుమారు 3.7 కిలోల వెండి వస్తువులు (వెండి కడ్డీలు, నాణేలు, బిందె), నగదు రూ. 2.13 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం రికవరీ విలువ సుమారు రూ. 10. 20 లక్షలుగా అంచనా వేశారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసును చాకచక్యంగా ఛేదించిన కుషాయిగూడ పోలీసులను స్థానికులు అభినందించారు.

# మత్తు చాక్లెట్లు తినిపించి... ఇంజనీరింగ్ విద్యార్థినిపై సహ విద్యార్థి అత్యాచారం

### - 18 నెలల నుండి నరకం చూపిన నిందితుడు... - కళాశాల గదిలోనే అత్యాచారం - నగ్న ఫోటోలు బయట పెడతానంటూ బెదిరింపులు...

**కుత్బుల్లాపూర్ మార్చి 02, (తెలంగాణ దిశ)** :మత్తు చాక్లెట్లు తినిపించి ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థినిపై తోటి విద్యార్థి గత 18 నెలలుగా అత్యాచారానికి పాల్పడుతూ, సహకరించకపోతే నగ్న ఫోటోలు షేర్ చేస్తానంటూ బెదిరించిన బీటెక్ విద్యార్థిని బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. బాచుపల్లి ఇన్ స్పెక్టర్ సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం బాచుపల్లి లోని విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాలలో బీటెక్ సివిల్ చదువుతున్న యువతి అదే కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఆశిష్ తనయ్(22) 2024 నుండి ప్రేమిస్తున్నానంటూ వెంటపడేవాడు. ఆమెకు నిందితుడు ఆశిష్ తరచూ మత్తు మందు కలిపిన చాక్లెట్లను ఇచ్చేవాడు. అనంతరం ఆమెను నగ్నంగా ఫోటోలు తీసి తన వద్ద భద్రపరుచుకున్నాడు. ప్రేమిస్తున్నానని ఆ ప్రేమ



బలంగా ఉండాలంటే తనతో శారీరకంగా కలవాలంటూ ఒత్తిడి తెచ్చాడు. చాక్లెట్లు తిన్న మత్తులో అతనికి శారీరకంగా లొంగిన ఆ యువతికి ఆ తర్వాత తరచూ అలాగే చేయాలంటూ ఇబ్బంది పెట్టేవాడు. అందుకు వ్యతిరేకిస్తే శారీరకంగా, మానసికంగా హింసించేవాడు. 2024లో కళాశాల తరగతి అయిపోయిన తర్వాత ఎవరూ లేని సమయంలో ఆ యువతిని శారీరకంగా లోపరుచుకున్నాడు. అప్పుడు విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి కళాశాల సెక్యూరిటీ గార్డులు వీరిద్దరిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని యాజమాన్యానికి అప్పగించారు. నిందితుడు కళాశాల యాజమాన్యానికి కూడా బురిడీ కొట్టించి మేనేజ్ చేసినట్లు యువతి తన ఫిర్యాదులోతెలిపింది. అనంతరం 2026 ఫిబ్రవరిలో నిందితుడు ఆశిష్ తన మిత్రుడైన ప్రవీణ్ తో కూడా చనువుగా ఉండాలంటూ ప్రతిపాదన తెచ్చాడు. దీంతో ఆ యువతి తిరగబడి, తప్పించుకొని పారిపోయి తను ఉంటున్న గదిలో ఆత్మహత్యకు ప్రయత్నించినట్టు సమాచారం. అనంతరం బాధితురాలి తల్లి కూతురు వద్దకు వచ్చి వివరాలు అడిగి తెలుసుకుని బాచుపల్లి పోలీసులకు గత శనివారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులు అందుకున్న బాచుపల్లి పోలీసులు పూర్తి వివరాలను సేకరించి, బాధితురాలు వాంగ్మూలం రికార్డ్ చేశారు. బలవంతంగా తనపై అత్యాచారానికి పాల్పడిన ఆశిష్ తనయ్ పై, అతని మిత్రుడు ప్రవీణ్ పై బాధితురాలు ఫిర్యాదు చేసింది. నిందితుడు ఆశిష్ ను బాచుపల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. అయితే తెలిసి తెలియని వయసులో కళాశాలలోనే జరుగుతున్న ఇలాంటి వ్యవహారాలపై కళాశాల యాజమాన్యం తీవ్రంగా పరిగణించకపోవడం పట్ల విమర్శలు తలెత్తుతున్నాయి. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# వాసవి అక్రమ నిర్మాణాలు ఆపాలి

### - కోమటికుంట చెరువును కాపాడాలి
### - ప్రజావాణిలో ఫిర్యాదు

**కుత్బుల్లాపూర్ మార్చి 02, (తెలంగాణ దిశ)** :బాచుపల్లి పరిధిలోని కోమటికుంట ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ లో నిర్మిస్తున్న వాసవి నిర్మాణ సంస్థపై చర్యలు తీసుకొని కోమటికుంట సరస్సును కాపాడాలని నిజాంపేటకు చెందిన ఆకుల సతీష్ సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కోమటికుంట సరస్సుకు ఒక గుర్తింపు పొందిన జలాశయమన్నారు దాని పూర్తి నిల్వస్థాయి (ఎఫ్ టిఎల్), బఫర్ జోన్ పరిధిలో వాసవి నిర్మాణ సంస్థ 8, 9 బ్లాకుల నిర్మాణం చేపట్టిందని దానిని తక్షణమే ఆపాలని కోరారు. ప్రస్తుతం వాసవి నిర్మాణ సంస్థ నిర్మిస్తున్న 8, 9 బ్లాక్ లు పూర్తిగా ఎఫ్ టిఎల్ బఫర్ జోన్ లో వస్తున్నాయని ఈ విషయమై గతంలో బాచుపల్లి పోలీస్ స్టేషన్ లో రెండు క్రిమినల్ కేసులు కూడా దాఖలు అయ్యాయని ఆయన గుర్తుకు చేశారు. ఇదే విషయమై హైకోర్టులో కేసులు కూడా దాఖలు అయ్యాయని వివరించారు. అయినప్పటికీ



అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దీంతో వాసవి సంస్థ తమ నిర్మాణాలను యధావిధిగా కొనసాగిస్తుందని ఆయన వివరించారు. తక్షణమే హెచ్ఎండిఏ, హైడ్రా, జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు కల్పించుకొని బాచుపల్లి లో వాసవి నిర్మాణ సంస్థ చేపట్టిన బ్లాక్ 8, 9 పనులను వెంటనే ఆపివేయాలని ఆయన కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసిన వారిలో అరుణ్ రావు, శ్రీనివాస్, ఈశ్వర్ రెడ్డి, ఎల్లస్వామి తదితరులున్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థులకు రూ. ఆరు లక్షల విలువ చేసే చెక్కుల పంపిణీ

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి






**ఉప్పల్, మార్చి 02, (తెలంగాణ దిశ)** :ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన పదకొండు మంది ఎంబీబీఎస్ విద్యార్థులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దాదాపు రూ. 6 లక్షల విలువ చేసే చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. ఉప్పల్ డీసీ కార్యాలయంలో డీసీ రాజు చేతుల మీదుగా ఎంబీబీఎస్ చెక్కులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ విద్యే భవిష్యత్తుకు బాటలు వేసే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చిన ప్రతిభావంతమైన విద్యార్థులకు బిఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ అండగా నిలుస్తుందని ఆయన అన్నారు. వైద్య విద్య అభ్యసిస్తూ భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, బిఆర్ఎస్ ఉప్పల్ నాయకులు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ విద్యార్థులు బండారి లక్ష్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

# రూ. 68 లక్షలతో వాసవి శివానగర్ లో అభివృద్ధి పనులు

### - ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**కుషాయిగూడ, మార్చి 02, (తెలంగాణ దిశ)** :చర్లపల్లి డివిజన్ పరిధిలోని వాసవి శివా నగర్ కాలనీలో మౌలిక వసతుల అభివృద్ధి కోసం రూ. 48 లక్షలతో నూతన పనులు, అలాగే రూ. 20 లక్షలతో పార్కు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నట్లు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వాసవి శివా నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు సోమవారం లక్ష్మారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలో చేపట్టబోయే అభివృద్ధి పనుల వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కాలనీ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం



పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు ఎన్. నరసింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె. బాలరాజు గౌడ్, కోశాధికారి వైజి. వెంకట్ గౌడ్ ఉపాధ్యక్షురాలు నీలిమ,సంఘటనా కార్యదర్శి ఎం. వెంకటేష్ గౌడ్, సహ కార్యదర్శి ఎ. అంజయ్య గౌడ్ కన్వీనర్ కె. యాదగిరి, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రాంచందర్ రావు, ఎంఎల్. ప్రసాద్, గోవిందు, పశుపతి రావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం


**హన్మకొండ, మార్చి 02, (తెలంగాణ దిశ)** : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా శ్రీ చైతన్య హనుమకొండ సి బిఎస్ ఇ పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థి, విద్యార్థులు తమ సొంత జ్ఞానంతో అధునాతనమైన సాంకేతిక పరిజ్ఞానంతో వారి యొక్క ప్రతిభా నైపుణ్యాలను కనబరిచారు. ప్రిన్సిపల్ లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థుల యొక్క ప్రతిభా పాటవాలను ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, అకాడమీ డైరెక్టర్ శ్రీవిద్య ,డీజీఎం చేతన్, ఆర్ ఐ మనోహర్, కో ఆర్డినేటర్ శివ కోటేశ్వర్, పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ, డీన్ కరుణాకర్, ప్రైమరీ ఇంచార్జ్ షాహిన్, ప్రీ ప్రైమరీ ఇంచార్జ్ శ్రావణి, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# అనంతగిరి హిల్స్ లో ముగిసిన కాంగ్రెస్ శిక్షణా శిబిరం

### - కుటుంబ సభ్యులతో రాహుల్ గాంధీని కలిసిన తోటకూర వజ్రేష్ యాదవ్

**వికారాబాద్, మార్చి 02, (తెలంగాణ దిశ)** :వికారాబాద్ సమీపంలోని అనంతగిరి హిల్స్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుల కోసం నిర్వహించిన శిక్షణా శిబిరం ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తన కుటుంబ సభ్యులతో కలిసి రాహుల్ గాంధీని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, రాజకీయ పరిస్థితులపై స్వల్పంగా చర్చించినట్లు తెలిపారు. శిక్షణా శిబిరం ద్వారా పార్టీ నాయకులకు సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాట




విధానాలు, ఎన్నికల వ్యూహాలపై ప్రత్యేక అవగాహన కల్పించినట్లు నాయకులు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల నుంచి హాజరైన డిసిసి అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ భావజాలాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్లే దిశగా ఈ శిబిరం ఉపయోగపడుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

# సంపాదకీయం

## హిందువులు లక్ష్యంగా బంగ్లాలో దాడులు !

బంగ్లాదేశ్‌లో అల్లర్లు భారత్‌ను రెచ్చగొట్టేలా సాగుతున్నాయా అన్న అనుమానం కలుగుతోంది. ఎందుకంటే యూనస్ తాత్కాలిక నేతగా పగ్గాలు చేపట్టిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు పెరిగాయి. హసీనాను పదవీచ్యుతి చేసిన తరవాత హిందువులు లక్ష్యంగా దాడులు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటికే వందలమందిని హతమార్చారు. హసీనా భారత్‌లో తలదాచుకుంటున్న నేపథ్యంలో కావాలనే అక్కడి మైనార్టీ హిందువులపై దాడులు విపరీతం అయ్యాయి. రాజకీయ హింసలో భాగంగా వీటిని చూపే ప్రయత్నం చేసి తప్పించుకోవాలని చూస్తున్నారు. అయితే గత ఏడాదిగా అక్కడ జరుగుతున్న అల్లర్లు కేవలం హిందువులను ఊచకోత కోసేవిగా ఉన్నాయి. పనిగట్టుకుని మూకలు రెచ్చిపోతున్నా, తాత్కాలిక ప్రభుత్వం ప్రేక్షకపాత్ర వహిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఇద్దరు హిందువులను హతమర్చారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దారుణాలపై భారతదేశంలో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న మూక దాడులను, హత్యలను సినీ ప్రముఖులు ఖండిస్తున్నారు. గాజాలో జరిగిన పరిణామాలను అయ్యో పాపం అనుకున్న భారతీయులు, పొరుగు దేశం బంగ్లదేశ్‌లో జరుగుతున్న పరిణామాలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా మౌనం వీడాలంటూ సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు. ఈ క్రమంలోనే హీరోయిన్లు జాన్వీపూర్, కాజల్ అగర్వాల్, సీనియర్ నటి, మాజీ ఎంపీ జయప్రద చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. బంగ్లాదేశ్‌లో రాజకీయ అనిశ్చితి కారణంగా ఆ దేశం రణరంగంగా మారిన సంగతి తెలిసిందే. అక్కడ ఇటీవల హిందువులపై వరుస దాడులు జరుగుతున్నాయి. తొలుత దీపుచంద్ర దాస్ అనే వ్యక్తిని దారుణంగా కొట్టి చంపి, అతని మృతదేహానికి నిప్పంటించిన ఘటన మురువకముందే తాజాగా మరో వ్యక్తిని కొట్టి చంపిన సంఘటన జరిగింది. అమృత్ మండల్ అలియాస్ సామ్రాట్ అనే వ్యక్తి రాజ్‌బరిలోని పంగ్షా ఉప జిల్లాలో హత్యకు గురయ్యాడు. సామ్రాట్ హత్య ఏ విధంగానూ మతపరమైనది కాదని ప్రాథమిక దర్యాప్తులో తేలిందని బంగ్లాదేశ్ ప్రభుత్వం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇది కేవలం హత్యను కప్పిపుచ్చుకోవడానికి చేసిన ప్రయత్నం తప్ప మరోటి కాదు. అయితే హిందువులపై జరుగుతున్న వరుస దాడులపై భారత్ తీవ్రంగా స్పందించింది. మైనారిటీ కమ్యూనిటీ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఇటీవల జరిగిన వరుస సంఘటనలను ఆందోళన కలిగించేవిగా అభివర్ణించింది. హిందువులపై ఇలాంటి హింసను విస్మరించలేమని భారత్ హెచ్చరించింది. సరిహద్దు వెంబడి జరుగుతున్న పరిణామాలను న్యూఢిల్లీ తీవ్రంగా పరిగణించిందని కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. హిందువులపై జరుగుతున్న హింసను విదేశాంగ మంత్రిత్వ శాఖ ఖండించింది. బాధ్యులను గుర్తించి శిక్షిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవలి పరిణామాల గురించి ప్రపంచమంతా గమనిస్తోంది. వాటిని నిశితంగా గమనిస్తున్నట్లు భారత్ కూడాపేర్కొంది శాంతిభద్రతల పరిస్థితి విషయానికొస్తే అక్కడ ఏం జరుగుతుందోఎప్పటి కప్పుడు భారత్ తెలియజేస్తున్నది. బంగ్లాదేశ్‌లోని హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులు సహా మైనారిటీలపై జరుగుతున్న దాడులు ఆందోళన కలిగించే విషయమని జైస్వాల్ అన్నారు. మైమెన్‌సింగ్‌లో ఇటీవల జరిగిన హిందూ యువకుడి దారుణ హత్యను ఖండిస్తున్నామని అన్నారు. ఈ నేరానికి పాల్పడిన వారిని చట్టం ముందు నిలబెట్టాలని ఆశిస్తున్నాం. తాత్కాలిక ప్రభుత్వ హయాంలో హత్యలు, దహనాలు, భూ కబ్జాలతో సహా మైనారిటీలపై 2,900 కంటే ఎక్కువ హింసాత్మక సంఘటనలు జరిగినట్లు స్వతంత్ర వర్గాలు నమోదు చేశాయి. ఈ సంఘటనలను కేవలం రాజకీయ హింసగా తోసిపుచ్చలేమని పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లో ఇద్దరు హిందూ వ్యక్తులను కొట్టి చంపిన నేపథ్యంలో భారత్ ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నిరసలు వస్తున్నా బంగ్లాదేశ్‌లో ముస్లిమేతరులు సహా పలువురి మీద జరుగుతున్న దాడులపై ప్రకంపనలు ఆగడం లేదు. విప్లవవాద నాయకుడు షరీఫ్ ఒస్మాన్ హదీ హత్యను నిరసిస్తూ అతని మద్దతుదారులు శుక్రవారం ఢాకాలోని కీలక కూడలిని దిగ్బంధం చేశారు. న్యాయం చేయాలని నినదిస్తూ బైఠాయించడంతో ట్రాఫిక్ గంటలతరబడి నిలిచిపోయింది. ఢాకా విశ్వవిద్యాలయ మసీదు నుంచి షాబాగ్ వరకు ప్రదర్శన చేపట్టి ధర్నా నిర్వహించారు. న్యాయం జరిగేవరకు పోరాటం కొనసాగుతుందని ప్రకటించారు. హదీ హత్యానంతరం చెలరేగిన అల్లర్లు, విధ్వంసకాండలో హిందూ కార్మికుడు దీపూ చంద్రదాస్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. మరోవైపు.. బ్రిటన్‌లోని ప్రవాసం వీడి 17 ఏళ్ల తర్వాత స్వదేశానికి చేరుకున్న బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ తాత్కాలిక ఛైర్మన్ తారిఖ్ రహ్మాన్ తన తండ్రి, బంగ్లా మాజీ అధ్యక్షుడు జియాఉర్ రహ్మాన్ సమాధిని సందర్శించి నివాళులర్పించారు. 19 ఏళ్ల తర్వాత ఈ సమాధి వద్దకు రాగలగడంపై ఉద్వేగానికి లోనై కన్నీళ్లు పెట్టుకున్నారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీ లపై దాడుల్ని కేంద్ర మాజీమంత్రి మీనాక్షీ లేఖి ఖండించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇంకా కొందరు నేతలు మొగల్ చక్రవర్తి బాబర్ మాదిరి ఆలోచనాధోరణితో ఉన్నారని విమర్శించారు. అందుకే ఆ రెండు దేశాల్లో హత్యలు జరుగుతున్నాయన్నారు. భారత్‌ను రెచ్చగొట్టాలనేదే వారి ఉద్దేశమని ఆరోపించారు. దండెత్తి వచ్చేవారిపై సహృదయత చూపాల్సిన అవసరం లేదన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల్ని భారత్ ఖండించింది. కిరాతకమైన దాడిలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడానికి కారకులైన దోషుల్ని శిక్షించాలని డిమాండ్ చేసింది. తాత్కాలిక ప్రభుత్వం వచ్చాక దాదాపు 2,900 హింసాత్మక ఘటనలు మైనారిటీలపై జరిగాయని విదేశీ వ్యవహారాల శాఖ తెలిపింది. వీటిని రాజకీయ హింసగా కొట్టిపారేయ లేమంది. పశ్చిమబెంగాల్ శాసనసభ విపక్షనేత సువేందు అధికారి కోల్‌కతాలో బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషన్ కార్యాలయంలో సీనియర్ అధికారులను కలిశారు. హిందూ మైనారిటీలపై దాడులకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఐదులక్షల మంది సన్యాసులతో వచ్చి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. బంగ్లాదేశ్‌లోని రెండుకోట్ల మంది హిందువుల్ని పదేపదే లక్ష్యంగా చేసుకుంటుంటే భారత్‌లోని వందకోట్ల మంది హిందువులు మౌన ప్రేక్షకులుగా కూర్చొంటారా అని ప్రశ్నించారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజల సహకారం అవసరం

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి






**ఉప్పల్, మార్చి02, (తెలంగాణ దిశ)** :బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా తెలంగాణలో నిర్వహిస్తున్న వంద రోజుల బాల్య వివాహాల నిర్మూలన, చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా ఉప్పల్ నియోజకవర్గంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు సమాజానికి శాపమని, ముఖ్యంగా బాలికల భవిష్యత్తును నాశనం చేసే దుష్ప్రభావం కలిగిస్తాయని పేర్కొన్నారు. 18 ఏళ్ల లోపు అమ్మాయిలకు, 21 ఏళ్ల లోపు అబ్బాయిలకు వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని అన్నారు. ఇందుకోసం ముఖ్యంగా తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ దీనిపై అవగాహన కలిగి బాధ్యతగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు. బాల్య వివాహాల నివారణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రతి గ్రామం, ప్రతి కాలనీలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి బాల్య వివాహ రహిత తెలంగాణ లక్ష్యాన్ని సాధించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించాలి

- కలెక్టర్ ను మర్యాద పూర్వకంగా కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు



**కరీంనగర్, మార్చి 02, (తెలంగాణ దిశ)** :కరీంనగర్ జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన చిత్రా మిశ్రాను తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజెఎఫ్) రాష్ట్ర కో కన్వీనర్, జిల్లా కార్యదర్శి కుడుతాడి బాపురావు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఫెడరేషన్ డైరీని కలెక్టర్ కు అందించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేయాలని కోరారు. జిల్లాలోని జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను కలెక్టర్ కు వివరించారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ ను కలిసిన వారిలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు గాదె కరుణాకర్ రావు, నరేందుల ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి కిరణ్, నాయకులు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మరో కొత్త ఆర్వోబీ..!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వేగం పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పలు జాతీయ రహదారుల నిర్మాణాలు, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మరో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆమోదం లభించింది. విజయవాడ వాంబేకాలనీ వాసుల చిరకాల కోరికను నెరవేరుస్తూ వాంబే కాలనీ- మధురానగర్ మధ్యన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వాంబే కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు ప్రాజెక్టులలో కదలిక వస్తోంది. ఈ క్రమంలోనే విజయవాడ ఈ కాలనీలో నివసించేపేదలు, కూలీల కల ఎట్టకేలకు నెరవేరనుంది. మధురానగర్ – వాంబేకాలనీ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి సంబంధించి అడుగులు పడనున్నా యి. అజిత్ సింగ్ నగర్, వాంబేకాలనీలలో నివసించే కూలీలు, నిరుపేదలు పనుల కోసం విజయవాడ నగరంలోకి రావాలంటే అవస్థ లు పడాల్సి వస్తోంది. సుమారు 50 వేల మంది కూలీలు, కార్మికులు విజయవాడలోకి రావాలంటే వాంబేకాలనీ–దేవీనగర్ మధ్య ఉన్న రైల్వేట్రాక్‌నుదాటాల్సి వస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం ఈ రైల్వేట్రాక్ దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ– విశాఖ రైల్వేలైన్ దాటి దేవీనగర్, మధురానగర్ మీదుగా నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ట్రాక్ సుమారుగా పది అడుగుల ఎత్తు ఉండటంతో మహిళలు, చిన్నారులు చాలా ఇబ్బంది లు పడాల్సి వస్తోంది.

## అందరూ మిత్రులే...

విజయవాడ: ఏ రాష్ట్రంలోనైనా ప్రాంతీయ పార్టీలు ప్రత్యర్థులుగా ఉంటూ కేంద్రంలో ఉన్న ప్రభుత్వాన్ని ఒకరు మద్దతిస్తే, మరొకరు వ్యతిరేకిస్తారు. కానీ ఏపీ రాజకీయాల తీరు వేరు. 2014 లో రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి ఇక్కడ ప్రధాన ప్రాంతీయ పార్టీలైన తెలుగుదేశం, వైసీపీలు కేంద్రంలో ఉండే బీజేపీ వైపు నిలుస్తున్నాయి. 2014 ఎన్నికల్లో టీడీపీనేరుగా బీజేపీతో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చింది. అదే సమయంలో ప్రతిపక్షంగా ఉన్న వైసీపీ కూడా కేంద్రంలో ఉన్నబీజేపీకి అనేక సందర్భాల్లో మద్దతుగా నిలిచింది. ఇక నాడు ప్రారంభమయిన దోస్తీనేటి వరకూ కొనసాగుతూనే ఉంది.

## అమ్మాయి దుస్తులపై అవాకులు ఇంకెంతకాలం?



అమ్మాయి గురించి చెప్పాలంటే.. ఆమెకి రక్షణగా నిలవాలంటే.. 'ఆమె రంగు, శరీరం, దుస్తుల గురించి ప్రస్తావన చేయడం తప్పనిసరి' అన్న భావన ఇంకెంతకాలం? ప్రభావవంతమైన చిత్రరంగంలో మహిళలపై అవాకులు, చెవాకులు పేలడం సర్వసాధారణమైన రోజులివి. హీరో అమ్మాయిల వెంట పడితేనే అభిమానులకి సంతోషమని వాక్రుచ్చిన పెద్దలు ఇండస్ట్రీలో ఉన్నారు. 'అమ్మాయిల గురించి ఒక్క మాటలో చెప్పమ'ని అడిగితే.. అత్యంత జుగుప్సాకరంగా మాట్లాడిన సీనియర్ నటులు ఉన్న రంగం ఇది. బహిరంగ వేదికలపై అమ్మాయిల గురించి అవమానకరంగా మాట్లాడితే పగలబడి నవ్వుతున్న కుర్ర నటులు ఏలుతున్న రంగం ఇది. ఇప్పుడు తాజాగా 'అమ్మాయిలు సురక్షితంగా ఉండాలంటే తను వేసుకున్న దుస్తులు పద్ధతిగా ఉండాల'ని, అత్యంత హేయమైన పదాలతో సుద్దులు చెప్పే వారు వచ్చారు.

ఇల్లాలిని అత్యంత గౌరవపాత్రలో చూపించిన వినోదరంగం రానురాను మహిళల పాత్రలని విలువలేనివిగా చిత్రీకరించే స్థితికి వచ్చింది. చిన్నా, పెద్ద పాత్రలతో సంబంధం లేకుండా మహిళలపై అవాకులు చవాకులు పేలడం పరిపాటిలా అయిపోయింది. సినిమాలు, టీవీలు, మాధ్యమం ఏదైనా.. సన్నివేశాలు, సందర్భాలు, పాటలు, డ్యాన్సులు ప్రతి ఒక్కదాంట్లో మహిళల పాత్రలని తక్కువ చేసి చూపిస్తున్నారు. ఒకప్పటి దర్శకులు, నిర్మాతలు, పాటలు, మాటల రచయితలు మహిళల పాత్రలని ఎంతో ఔన్నిత్యంతో తీర్చిదిద్దేవారు. పాత్రలు వేసుకున్న బట్టలని బట్టి, మేకప్‌ని బట్టి ఆమెకి ఆదరణ పెరిగేది కాదు. ఆ పాత్ర తాలూకు వ్యక్తిత్వం, ఆమె పట్ల ఎనలేని గౌరవాన్ని, అభిమానాన్ని తెచ్చిపెట్టేవి.

ఆ ప్రభావం సమాజంలో ఎంతో ఉండేది. స్త్రీల పట్ల గౌరవమర్యాదలతో మసలుకోవడంలో ఆ సంస్కృతి పెద్ద పాత్రనే పోషించింది. కానీ క్రమేణా మనుషులు మారుతూ వచ్చారు. పాత్రల తీరు కొత్త రూపం సంతరించుకుంది. మాటలు హద్దులు దాటుతున్నాయి. చేతలు ఛీకొట్టేంతగా దిగజారాయి.

ప్రభావవంతమైన రంగంలోని వ్యక్తులు మాట్లాడే మాటలు సమాజంలోకి వేగంగా వెళతాయి. బహిరంగ వేదికపై ఒకప్పుడు చలపతిరావు, బాలకృష్ణ మాట్లాడిన సిగ్గుమాలిన వ్యాఖ్యలపై పెద్ద దుమారమే లేచింది. ఇటీవల శివాజీ చేసిన వ్యాఖ్యలు కూడా అలాంటివే. అయితే సందర్భాలు ఏవైనా, వ్యక్తులు ఎవరైనా సినిమా సంస్కృతిలో వచ్చిన విపరీతాలకి ఇవి నిదర్శనం. ఇప్పుడు చర్చ వ్యాఖ్యలపై, వ్యక్తులపై కాకుండా చిత్రసీమలో వస్తోన్న పెడధోరణులపై రావాలి. అప్పుడే సమస్య గాడిన పడుతుంది. పరిష్కారం వైపు అడుగులు పడతాయి. ఈ సందర్భంగా శివాజీ పేలిన ప్రేలాపనలపై నటుడు నాగబాబు అన్న మాటలు అక్షరసత్యాలు. 'ఆడపిల్లలు ఎలా ఉండాలి.. ఎలాంటి దుస్తులు ధరించాలి.. ఏం మాట్లాడాలి.. ఏం మాట్లాడకూడదు అనే విషయాలపై ప్రతి ఒక్కరూ ఇష్టం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తున్నారు. అలా కామెంట్స్ చేయడం రాజ్యాంగం ప్రకారం తప్పు. ఆడవాళ్లు ఇలాంటి డ్రెస్‌లు మాత్రమే వేసుకోవాలి అని చెప్పడానికి మీకేం హక్కు ఉంది? ప్రతి ఆడపిల్లకు ఆత్మగౌరవం ఉంటుంది. ప్రపంచంలో ఫ్యాషన్ అనేక రకాలుగా మారుతూ ఉంటుంది. ప్రతి ఆడపిల్లను కుటుంబ సభ్యురాలిలానే చూడండి. మగవారితో సమానంగా బతికే హక్కు మహిళలకు కూడా ఉంటుంది' అని నాగబాబు అన్నారు. ఇంకా శివాజీ వ్యాఖ్యలని ఖండిస్తూ ఎందరో నటీనటులు తమ వాణిని బలంగా వినిపించారు. ఈ పరిణామం హర్షించదగ్గది. అమ్మాయిని ఏడిపిస్తేనే హాస్యం పండుతుందని, తన దుస్తులపై మాట్లాడితేనే చప్పట్లు కొడతారని, 'ఆమెతో ఎలా ప్రవర్తించాలో తను వేసుకున్న బట్టలే చెబుతాయి' అన్న డైలాగ్ రాస్తేనే విజిల్స్ వేస్తారని అనుకోవడం చాలా తప్పు. 'మహిళలు ఎలా ఉండాలి? ఎలా నడుచుకోవాలి? ఏం మాట్లాడాలి? ఏం మాట్లాడకూడదు?' అని తెరపై ప్రభావవంత పాత్రలతో చెప్పించే ధోరణికి స్వస్తి చెప్పాలి. అమ్మాయిలతో ఎలా నడుచుకోవాలి! ఎలా గౌరవించాలి! ఆమె గౌరవం తను వేసుకున్న బట్టల్లోనో.. నడకలోనో ఉండదని చూపించే సంస్కృతి మళ్లీ రావాలి. 'సినిమాలో చూపించినంత మాత్రాన సమాజ తీరుతెన్నులు మారిపోతాయా?', ఆడవాళ్ల పట్ల ప్రవర్తించే ధోరణి మారిపోతుందా?', 'సినిమాల్లో ఉన్నట్లుగా బయట కూడా అలాగే జరుగుతుందా?' అని వితండవాదం చేసేవారు ఉంటారు. అయితే 'అమ్మాయిలు గౌరవంగా ఉండాలంటే ఒంటినిండా బట్టలు కప్పుకోవాలి. అదే భారతీయ సంస్కృతి..' అని చెప్పడం ఏ సంస్కృతి? అసలు తను వేసుకునే దుస్తుల వల్లే తనపై మగవాళ్ల దృష్టి మారుతుందని చెప్పడం ఏ రీతి?: సమాజంలో స్త్రీ, పురుషులు ఒకేలా జీవించాలి. రాజ్యాంగం పౌరులందరికీ సమాన హక్కులు ఇచ్చింది. ఆంక్షలు, కట్టుబాట్ల పేరుతో మహిళల స్థాయిని, గౌరవాన్ని తక్కువ చేసే హక్కు ఎవరికీ లేదు. 'దుస్తుల చుట్టూనో.. రాజ కీయంగానో, స్వేచ్ఛ, విచ్చలవిడితనం.. అనో' ఈ సమస్యని పక్కదోవకి పట్టించకుండా.. గౌరవంగా జీవించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందనే రీతిలో చర్చ నడవాలి.

## నల్లమల్లలో గుప్త నిధుల కలకలం



కొల్లాపూర్,తెలంగాణ దిశ : నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గుప్త నిధుల తవ్వకాలు కలకలం సృష్టించాయి. ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నల్లమల్లలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు తెలుస్తోంది. కొల్లాపూర్ ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని ములచింతలపల్లి బీటు పరిధిలో మెదరబండ సమీపంలోని దేవుని బొక్క వద్ద గుప్తనిధుల కోసం కొంతమంది దుండగులు తవ్వకాలు జరుపుతుండగా ఫారెస్ట్ అధికారులు అదుపులోకి తీసుకొని కొల్లాపూర్ లోని ఫారెస్ట్ డిపోకు తరలించారు. గుప్త నిధుల తవ్వకాల కోసం వాడిన సామాగ్రితో పాటు ద్విచక్ర వాహనాలను సైతం ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గత కొద్ది వారాల నుంచి యథేచ్ఛగా దేవుని బొక్క వద్ద గుహలో గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు గుర్తించలేకపోవడంపై పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. దేవుని బొక్క వద్ద ఉన్న పురాతనమైన రాత్రి విగ్రహాలను ధ్వంసం చేసినట్లు సమీప గ్రామ ప్రజలు పేర్కొంటున్నారు. గుప్తనిధులతో పట్టుబడిన దుండగులను అచ్చంపేట ఫారెస్ట్ డివిజనల్ ఆఫీసుకు ఫారెస్ట్ అధికారులు తరలించారు.

## ఆస్ట్రేలియాలో ఖలిస్తాన్ ఉద్యమం

సిడ్నీ, : ఆస్ట్రేలియా.. ఇటీవలే ఆ దేశంలో తండ్రీ కొడుకులైన ఇద్దరు ఉగ్రవాదులు పర్యాటకులపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఇందులో 15 మంది మరణించారు. కాల్పులు జరిపిన ఇద్దరిలో ఒకరిని పోలీసులు కాల్చి చంపేశారు. ఇక తాజాగా సిక్కు వేర్పాటు వాద సంస్థ అయిన ఖలిస్తాన్‌కు చెందిన కొంత మంది ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో భారత జాతీయ పతాకాన్ని కత్తితో చీల్చారు. భారత్ వ్యతిరేక ఖలిస్తాన్ అనుకూల నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఖలిస్తాన్ సంస్థ మొన్నటి వరకు కెనడా కేంద్రంగానే ఇలాంటి భారత వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించింది. కెనడా మాజీ ప్రధాని ట్రూడో ప్రభుత్వం కూడా వారికి అండగా నిలిచింది. ఇప్పుడు ఖలిస్తాన్ ఆస్ట్రేలియాలో భారత వ్యతిరేక నినాదాలు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికే హమాస్ అనుకూల ఉగ్రవాదులు ఆస్ట్రేలియాలో పెరిగారు. తాజాగా ఖలిస్తాన్ మద్దతుదారుల ఆందోళన కలకలం రూపింది. భారత్‌లో సిక్కు వేర్పాటు వాదమే లక్ష్యంగా ఖలిస్తాన్ పనిచేస్తోంది. ఖలిస్తాన్ దేశం కావాలని డిమాండ్ చేస్తోంది. ఘటన ఆస్ట్రేలియాలోని భారతీయ కమ్యూనిటీలో విభజనలను పెంచుతోంది. ఒక వర్గం దేశభక్తి ప్రదర్శిస్తుంటే, మరొక వర్గం విదేశీ ఆధారాలతో వ్యతిరేకత చూపుతోంది. ఇది భవిష్యత్ ఎన్నికలు, సామాజిక సంబంధాలపై దీర్ఘకాల ప్రభావం చూపనుంది.

# ప్రణాళికతో చదివితే మేలైన ఫలితాలు!



బాగా చదవాలంటే చేతిలో పుస్తకం మాత్రమే ఉంటే సరిపోదు. చదవాలనే ఆసక్తి, కోరిక, కొత్త విషయాలు నేర్చుకోవాలనే తపన అవసరం. అలాగే పరీక్షలో పాసవ్వడమే ధ్యేయంగా చదవొద్దు. ఇష్టంగా, బాధ్యతతో చదవాలి. అప్పుడు అనుకున్న పరీక్షా ఫలితాలు వస్తాయి. అనుకున్న కొలువును సాధించొచ్చు. పరీక్షల్లో అందరికీ మార్కులు ఒకేలా రావు. కొందరికి ఎక్కువ. మరికొందరికి తక్కువగా వస్తుంటాయి. ఇంకొందరు ఆశించిన మార్కులను సొంతం చేసుకుంటారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించడానికి సరైన వ్యూహాలు, పద్ధతులు పాటించడం ముఖ్యం. చేతిరాత అందంగా ఉండటం, సమాధానాలు స్పష్టంగా రాయడం, ప్రాక్టీస్ పాత ప్రశ్నలు రాయడం వంటి చిట్కాలు ఉపయోగపడతాయి. వచ్చే ఏడాది ప్రారంభం నుంచి వివిధ పరీక్షలు రాబోతున్నాయి. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇతర పోటీపరీక్షలు, ఇంజనీరింగ్, మెడిసిన్ ఇలా అనేక రకాల పరీక్షలు జరుగుతాయి. పరీక్షలు రాయడం అనేది ప్రతి విద్యార్థికి ఒక గొప్ప సవాలు. కొంతమంది విద్యార్థులు సమర్థవంతంగా అద్భుతమైన మార్కులను సాధించగలుగుతారు. మరికొంత మంది మాత్రం మంచి మార్కులు అందుకోలేరు. సరైన వ్యూహాలు, పద్ధతులు పాటించడం ద్వారా, ప్రతి విద్యార్థి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించొచ్చు.

ఇష్టంగా చదవాలి : బలవంతంగా చదివితే ఏదీ అర్థం కాదనేది గుర్తించుకోవాలి. చదవడాన్ని విసుగు తెప్పించే వ్యాపకండా భావించొద్దు. కొత్త విషయాలను నేర్చుకోవటానికి దక్కిన అవకాశంగా భావించారు. చదవడం కోసం ఎంత సమయాన్ని కేటాయించగలిగితే అంత మంచిది. అప్పుడు సమయం వృథా కాదు. ఏకాగ్రతను దెబ్బతీసే వాటికి దూరంగా ఉండాలి. విద్యార్థిగా ప్రతి ఒక్కరి లక్ష్యంగా ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవడమే కావాలి. అదే లక్ష్యంతో ముందుకెళ్తే మనపై మనకు నమ్మకం పెరుగుతుంది.

చేతిరాతను సరిచూసుకోవాలి :
ప్రిపేరయ్యే ఏ పరీక్షలోనైనా సమాధానాలు రాయడానికి కష్టపడి చదివినంత మాత్రానే మంచి మార్కులు రావు. పరీక్షలు రాసేటప్పుడు, చేతిరాత చాలా ముఖ్యమైంది. ఎందుకంటే, సమాధాన పత్రాన్ని దిద్దే అధికారులు చేతిరాతను స్పష్టంగా చదివి అర్థం చేసుకోవాలి. చేతిరాత అందంగా లేకపోతే, ఎంత చదివినా మార్కులు రావు. అందువల్ల మంచి చేతిరాతతో పరీక్షలు రాయడం చాలా ముఖ్యం. పరీక్ష రాసే ముందు చదివినవి గుర్తు పెట్టుకోవడానికి, అక్షర దోషాలు సరిచేయడానికి ఒకసారి రాసి చూసుకోవడం చాలా ఉపయోగ కరం. ఇది చదివిన విషయాలను గుర్తు చేస్తుంది. మీరు సమాధాన పత్రంలో ఎన్ని పదాలు రాస్తున్నారో తెలుసుకోవచ్చు. ఈ విధంగా సమయం ఎలా కేటాయించాలో తెలుసుకో గలుగుతారు.

ముఖ్యంగా పదోతరగతి, ఇంటర్ విద్యార్థులు వారు రాసే సమాధానాల్లో ప్రతి వరుసలో సుమారు 6 నుంచి 7 పదాలు ఉండేలా చూసుకోవాలి. పదాల మధ్య సరైన గ్యాప్ ఇవ్వడం అవసరం. పదాలు కలిసిపోకుండా, కొన్ని స్పేస్ ఇచ్చి రాస్తే మరీ మంచిది. ఇది కరెక్షన్ చేసే వారికి స్పష్టంగా చదవడానికి సహాయపడుతుంది. రాయడంలో ఉపయోగించే పెన్ను కూడా చాలా ముఖ్యం. ఒక మంచి పెన్నుతో రాయడం వల్ల చేతిరాత మృదువుగా, స్పష్టంగా కనిపిస్తుంది.

ప్రాక్టీస్ కూడా కీలకమే : ప్రిపరేషన్‌లో చేతిరాత మెరుగుపర్చుకోవాలంటే ప్రతి రోజూ ప్రాక్టీస్ ముఖ్యం. ప్రత్యేకంగా ముఖ్యమైన పదాలు, వాక్యాలు, అక్షరాలు రాయడం ద్వారా, సాధించాల్సిన స్థాయి చేతిరాతను సాధించొచ్చు. పరీక్ష రాయటానికి సిద్ధపడే ముందు, పాత పరీక్షల ప్రశ్నలను, సూచనలను రాసి ప్రాక్టీస్ చేయాలి. ఇది రాయడంలో వేగాన్ని పెంచుతుంది,
చేతిరాతను మరింత మెరుగుపరుస్తుంది. పరీక్ష సమాధానాలను స్పష్టంగా, సూటిగా రాయాలి. చేతిరాత రకరకాలు గా మారకుండా ఒక విధంగా ఉండేలా చూసుకోవాలి.

ప్రణాళికతో చదవాలి : ఎక్కువ మార్కులు సాధించాలంటే స్మార్ట్ వర్క్ పక్కా ప్రణాళిక, క్రమశిక్షణతో కూడిన చదువు అవసరం. సిలబస్‌ను అర్థం చేసుకోవడం, పాత ప్రశ్నపత్రాలు ప్రాక్టీస్ చేయడం, ముఖ్యమైన పాయింట్స్ నోట్స్ రాసుకోవడం, సమయపాలన పాటిస్తూ అన్ని సబ్జెక్టులపై దృష్టి పెట్టడం, చేతిరాతను మెరుగుపరుచుకోవడం వంటివి చేస్తే తప్పకుండా మంచి మార్కులు వస్తాయి.

టైమ్‌టేబుల్ : సిలబస్ పూర్తి చేయడానికి, రివిజన్ చేయడానికి ఒక టైమ్‌టేబుల్ వేసుకోవాలి బట్టీ పట్టడం కాకుండా, కాన్సెప్ట్‌లను అర్థం చేసుకోవాలి. మెదడుకు పని చెప్పేలా చదవాలి. ఇదే స్మార్ట్‌వర్క్. అధ్యయన పద్ధతుల్లో భాగంగా ముఖ్యమైన టాపిక్స్, ఫార్ములాస్, నిర్వచనాలను నోట్ చేసుకోవాలి. పాత ప్రశ్నపత్రాలు: గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం వల్ల ప్రశ్నల సరళి అర్థమై, ఆత్మవిశ్వాసం పెరుగుతుంది.అన్ని సబ్జెక్టులకు సమయం కేటాయించి, ముఖ్యంగా కష్టమైన వాటికి ఎక్కువ శ్రద్ధ పెట్టండి. పరీక్ష సమయంలో స్పష్టంగా, చదవడానికి వీలుగా రాయం డి. పదాల మధ్య సరైన గ్యాప్, తేలికైన పెన్ను వాడండి. సమయపాలన: అనవసరమైన విషయాలు రాయకుండా, అడిగిన ప్రశ్నకు సూటిగా సమా ధానం రాయండి. ఇది సమయాన్ని ఆదా చేస్తుంది.

ఏ పరీక్ష అయినా రాసిన తర్వాత సమాధానాలను ఒకసారి పరిశీలించుకోండి.ఆత్మవిశ్వాసం : 'నేను చేయలేను' అనే భావనను వదిలేసి, నమ్మకంతో ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయాలి. చదివేటప్పుడు ఏకాగ్రతతో, శ్రద్ధగా వినడం ముఖ్యం. సందేహాలను అప్పటికప్పుడు నివృత్తి చేసుకోండి.

## రైల్వే రిజర్వేషన్ సమయాల్లో మార్పులు




న్యూఢిల్లీ : భారతీయ రైల్వే టికెట్ బుకింగ్ వ్యవస్థలో కీలక మార్పులు చేసింది. ఐఆర్‌సిటిసి ఖాతా ఆధార్ అనుసంధానమైన ప్రయాణికుల కోసం రిజర్వేషన్ సమయాలను పొడిగిస్తూ రైల్వే బోర్డు నిర్ణయం తీసుకుంది. ఈ కొత్త నిబంధనలు నుండి అమలులోకి రానున్నాయి. టికెట్ బుకింగ్ వ్యవస్థలో దళారుల ఆగడాలను అరికట్ట డానికి , అసలైన ప్రయాణికులకు మాత్రమే బెర్తులు దక్కేలా చేయడా నికి ఈ నిర్ణయం తీసుకున్నామని రైల్వే అధికారులు తెలిపారు.. గతంలో జనరల్ రిజర్వేషన్ ప్రారంభమైన మొదటి 15 నిమిషాలు మాత్రమే ఆధార్ వెరిఫికేషన్ తప్పనిసరిగా ఉండేది. ఆ తర్వాత దీనిని ఉదయం 8 నుండి 10 గంటల వరకు పొడిగించారు. ఇప్పుడు ఈ సమయాన్ని మరింత పెంచుతూ రైల్వే బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆధార్‌తో లింక్ అయిన వినియోగదారులు మాత్రమే ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోగలిగే సమయాలను దశలవారీగా మార్చామని ఐఆర్‌సిటిసి తెలిపింది. అడ్వాన్స్ రిజర్వేషన్ పీరియడ్ (ఎఆర్‌పి) ప్రారంభమయ్యే రోజున, సాధారణ రిజర్వేషన్ల కోసం ఆధార్ ఆధారిత బుకింగ్‌ను అర్ధరాత్రి 12 గంటల వరకు పొడిగించారు.. దీంతో సామాన్య ప్రయాణికులకు టికెట్లు దొరుకుతాయని అధికారులు తెలిపారు. గత వారం అన్ని జోన్ల ప్రిన్సిపల్ చీఫ్ కమర్షి యల్ మేనేజర్లకు పంపిన లేఖలో ఈ మార్పులను స్పష్టం చేశారు. అయితే ప్రయాణికులు తమ ఐఆర్‌సిటిసి ఖాతాను ఆధార్‌తో అనుసం ధానం చేసుకోవడం ద్వారా మాత్రమే ఈ సదుపాయాన్ని పొందవచ్చు అని రైల్వే అధికారులు మరోసారి స్పష్టం చేశారు.

## రేబిస్‌తో గేదె మృతి..

### భయంతో 200 మంది గ్రామస్తులకు వ్యాక్సిన్లు




ఉత్తరప్రదేశ్ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని బుదౌన్ జిల్లాలో రేబిస్ వ్యాధి కలకలం సృష్టించింది. పిప్రౌలి గ్రామంలో రేబిస్ వ్యాధితో ఓ గేదె మృతిచెందడం భయాందోళనలకు గురిచేసింది. దీంతో ముందు జాగ్రత్తగా ఆ గ్రామంలోని 200 మందికి యాంటీ రేబిస్ టీకాలు వేశారు. పిప్రౌలి గ్రామంలో డిసెంబర్ 23వ తేదీన కర్మ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వచ్చిన గ్రామస్తులకు భోజనంలో రైతా వడ్డించారు. అయితే ఆ రైతా తయారీకి వాడిన పాలు మొత్తం అదే గ్రామానికి చెందిన ఓ గేదెవి. ఆ గేదెను కొద్దిరోజుల ముందు ఓ కుక్క కరిచింది. ఈ క్రమంలోనే డిసెంబర్ 26వ తేదీన ఆ గేదె అకస్మాత్తుగా మరణించింది. అయితే గేదె మరణించడానికి ముందు దానిలో రేబిస్ లక్షణాలు కనిపించడంతో గ్రామస్తుల్లో భయాందోళనలు మొదలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి, పరిస్థితిని సమీక్షించారు. చనిపోయిన ఆ గేదె పాలతో తయారుచేసిన రైతా తిన్న వారికి కూడా రేబిస్ సంక్రమించే ప్రమాదం ఉందని భావించి, వారందరికీ యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ప్రస్తుతం గ్రామస్తులు ఎవరికీ రేబిస్ లక్షణాలు లేవని.. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగానే యాంటీ రేబిస్ టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు.

## యానాం రీజెన్సీ కార్మికుల వీరోచిత పోరాటం

### – జనవరి నాటికి 13 ఏళ్లు



**కాకినాడ,తెలంగాణ దిశ:** తీవ్రమైననిర్బంధాన్ని, అణచివేతనుప్రతి ఘటిస్తూ, కార్మికులు కలసికట్టుగా సాగించిన వీరోచిత పోరాటం– యానాంరీజెన్సీ సిరామి క్స్ కార్మికుల పోరాటం. పరిశ్రమలో 2012 జనవరి 27న జరిగిన ఘటనకు 2026 జనవరితో 13 ఏళ్లు అవుతున్నాయి. నాటి ఘటన కార్మికుల కళ్ల ముందు ఇంకా కదలాడుతూనే ఉంది. యాజమాన్యం నిరంకుశ ధోరణి కారణంగా పోలీసు కస్టడీలో మృతి చెందిన మచ్చా మురళీమోహన్ కుటుంబంతో పాటు పోలీసుల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వాల నుంచి ఎటువంటి సాయమూ అందలేదు. నాటి నుంచి నేటివరకూ సిఐటియు ఆధ్వర్యాన కార్మికులు న్యాయం కోసం పోరాడుతూనే ఉన్నారు. యూనియన్ ఏర్పాటును వ్యతిరేకించిన యాజమాన్యం: 1984లో యానాంలో స్థాపించిన రీజెన్సీ సిరామిక్స్ ఫ్యాక్టరీలో సుమారు మూడు వేల మందికి పైగా కార్మికులు పని చేసేవారు. ఫ్యాక్టరీ లాభాలను ఆర్జిస్తున్నా కార్మికులకు కనీస వేతనం, చట్టాల అమలు వంటివి లేవు. ప్రశ్నించే వారిపై యాజమాన్యం కక్ష సాధింపులకు దిగేది. దీంతో, కార్మికులు 2011లో రీజెన్సీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మచ్చా మురళీమోహన్‌ను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. ఇది గిట్టని యాజమాన్యం మురళీమోహన్‌తో సహా సుమారు 50 మందిని విధుల నుంచి తొలగించింది. తప్పనిసరి పరిస్థితుల్లో 2012 జనవరి రెండు నుంచి కార్మికులు సమ్మెకు దిగారు. అయినా, యాజమాన్యం తన అణచివేత చర్యలను ముమ్మరం చేసిందే తప్ప.. పరిస్థితిని చక్కదిద్దే పని చేయలేదు. పుండు మీద కారం చల్లినట్టు జనవరి 27న యాజమాన్యం పోటీ కార్మికులను పనిలోకి దింపింది. అడ్డుకున్న కార్మికులపై తీవ్రమైన లాఠీఛార్జి చేయించింది. ఈ క్రమంలోనే కార్మిక నాయకుడు మచ్చా మురళీమోహన్ లాకప్ డెత్‌కు గురయ్యారు. ఇది కార్మికుల్లో తీవ్ర ఆగ్రహావేశాలకు దారి తీసింది. యూనియన్ ఏర్పాటును అడ్డుకోవటంతో పాటు సంఘ నాయకుడిని పొట్టన పెట్టుకోవటంతో ప్రవాహంలా కదలి ఫ్యాక్టరీని చుట్టుముట్టారు. పోలీసులు పెద్దసంఖ్యలో మోహరించి, కార్మికులపై విరుచుకుపడ్డారు. కాల్పులకు తెగించారు. పోలీసు కాల్పుల్లో తొమ్మిది మంది కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. **కార్మికులపై తప్పుడు కేసులు:** ఈ సంఘటనలో పలువురు కార్మికులపై పోలీసులు తప్పుడు కేసులు బనాయించారు. 55 మందిని అక్రమంగా అరెస్టు చేసి సబ్ జైలుకు తరలించారు. రెండు నెలల పాటు శిక్షను అనుభవించిన కార్మికులు కండిషన్ బెయిల్‌పై విడుదలయ్యారు. కార్మికులు రోజూ కాకినాడ, పాండిచ్చేరిలోని స్టేషన్లలో సంతకాలు చేయాల్సి వచ్చింది. ఆ కాలంలో సిఐటియు కార్మికులకు ఆశ్రయం కల్పించింది. కోర్టు ఖర్చులను సైతం భరించింది. 225 మంది కార్మికులపై ఇంకా కేసులు నడుస్తున్నాయి. చట్టాలను, కార్మిక హక్కులను గౌరవించని యాజమాన్యాలు ఎంతటి దౌర్జన్యానికైనా తెగిస్తాయనటానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ. అణచివేత చర్యలతో కార్మిక పోరాటాలను అడ్డుకోలేరని చెప్పటానికి యానాం రీజెన్సీ కార్మికుల వీరోచిత పోరాటం తిరుగులేని నిదర్శనం.

## బాధ్యతలు స్వీకరించిన ఇన్చార్జి ఎల్ ఐ



**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** కమాన్ పూర్ మండలం రొంపిగుంట సబ్ స్టేషన్ ఎన్ పి డి సి ఎల్ ఇన్చార్జి లైన్ ఇన్స్పెక్టర్ గా కాసుల రవి బాధ్యతలు స్వీకరించారు. రొంపి కుంట లైన్ ఇనస్పెక్టర్ గా పని చేసిన కృష్ణ సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్గా పదోన్నతి పొందుతూ కమాన్ పూర్ సబ్స్టేషన్ కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ముత్తారం లైన్మెన్ గా పనిచేస్తున్న కాసుల రవి కి పదోన్నతి కల్పిస్తూ మంథనిఏడి ప్రభాకర్ రొంపి కుంట ఇన్చార్జి లైన్ స్పెక్టర్ గా బదిలీ చేశారు. దీంతో ఆయన ఏఈ అశోక్ కుమార్కు ఉత్తర్వులను అందజేసి బాధ్యతలను స్వీకరించారు. బదిలీపై వచ్చిన రవికి ఎల్ ఐ సత్యనారాయణ రావు, ఎల్ ఎం లో కలవేన ఓదెలు గురుముట్ల శ్రీధర్ ఎఎల్ఎం పాడియా ధర్మ సింగ్ అన్యాన్ తిరుపతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఖని లో అట్టహాసంగా రాష్ట్ర స్థాయి ఎస్ జి ఎఫ్ టోర్నీ

**అండర్ 17 కరాటే క్రీడాకారుల సెలక్షన్స్**
**కరాటే టోర్నీలో ప్రతిభ చూపి 13 బంగారు పతకాలు**
**సాధించిన ఉమ్మడి కరీంనగర్ కరాటే విద్యార్థులు**
**13 మంది బాల,బాలికలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక...**




గోదావరిఖని,తెలంగాణ దిశ ::తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టే క్రీడా పోటీల్లో భాగంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జిఎఫ్ )రాష్ట్ర స్థాయి పోటీలు గోదావరిఖని పట్టణంలో ఆదివారం అట్టహాసంగా నిర్వహించారు. సింగరేణి ఆర్ సి ఓ ఏ క్లబ్ వేదికగా ఎస్జిఎఫ్ అండర్– 17 బాల బాలికల కరాటే పోటీలు ఘనంగా జరిగాయి. రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ ను పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ డి. ఈ. ఓ హనుమంతరావు ప్రారంభించారు. స్టేట్ టోర్ని కి అబజ్వర్ గా డాక్టర్ దాసరి మల్లేష్ వ్యవరించారు. సెలక్షన్ వ్యాయామ ఉపాధ్యాయ జిల్లా ఎస్జీఎఫ్ సెక్రటరీ కనుకుంట్ల లక్ష్మణ్ ముఖ్య అతిధిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరాటే క్రీడాకారులను ఉద్దేశించి పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ డి ఈ ఓ హనుమంతరావు మాట్లాడుతూ...విద్యార్థి దశ నుంచే క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఎస్జీఎఫ్ పేరిట క్రీడా పోటీలకు సంబంధించి సెలక్షన్స్ నిర్వహిస్తుందని చెప్పారు. చదువుతోపాటు ప్రతి విద్యార్థి శారీరక దారుఢ్యాన్ని పెంచుకోవాలని సూచించారు. కరాటే క్రీడాకారులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయస్థాయిలో నిర్వహించే పోటీల్లో సత్తా చాటాలని పిలుపునిచ్చారు. గత సంవత్సరం జరిగిన జాతీయస్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో జిల్లాకు పథకాలు వచ్చిన విషయాన్ని సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాస్థాయి సెలక్షన్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోఆర్డినేటర్ తగర శంకర్, సిటోరియో కరాటే అసోసియేషన్ స్టేట్ చీఫ్ కరాటే శ్రీనివాస్, జిల్లా కరాటే అసోసియేషన్ ప్రతినిధి వడ్డేపల్లి సురేష్ పర్యవేక్షణ చేశారు. ఈ సెలక్షన్, టోర్నమెంట్ కు పసునూటి శంకర్ మంథని నాగరాజు పసూనూటి చందు, శ్రావణ్ కుమార్, సుంకే రాజు ,బండి పరమేష్, పవన్, బోయపోతు రాము అన్వేష్ రెఫరల్గా వ్యవహరించారు. కరీంనగర్ అదిలాబాద్ నిజామాబాద్ మెదక్ రంగారెడ్డి హైదరాబాదు మహబుబ్ నగర్ నల్గొండ వరంగల్ ఖమ్మం ఉమ్మడి జిల్లాల నుండి 240 మంది విద్యార్థులు ఈ సెలెక్షన్ పోటీ పడగా 24 మంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. కరీంనగర్ నగర్ ఉమ్మడి జిల్లా నుండి సృష్టి టుమానే, శ్రీవార్ష, శ్రీవల్లి పి.శ్రీజ, బి.సహస్ర పి.సహస్ర శ్రీరాజ్ విఘ్నేష్ టి జయసాయిచరణ్ అకాష్ డి.శివ హర్షవర్ధన్ డి.దేవాన్ష్ బంగారు పతకాలు సాధించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా కొచ్ మేనేజర్ గా ముక్తి శ్రీ,సునేహ సుల్తానా వ్యవరించారు. గెలుపొందిన కరాటే విద్యార్థులు రామగుండం ఎమ్మెల్యే మాక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ మాక్కాన్ సింగ్ సేవ సమతి అధ్యక్షురాలు మనాలి ఠాగూర్ అభినందించారు. ఈ పోటీల్లో రాష్ట్ర పేట ఉపాధ్యక్షుడు కొమురోజు శ్రీనివాస్ , రాష్ట్ర పేట ఉపాధ్యక్షురాలు శోభ, జావిద్, విజయ్ ,ఖాజాభీ రమేష్, కనకేష్, పెద్దపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు అడిగితే అక్రమ అరెస్టులా

**-ప్రజా ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు వస్తాయి**
**-మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షులు కనవేన శ్రీనివాస్**




**మంథని,తెలంగాణ దిశ :** గతంలో తాము చేసిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు చెల్లించాలని కోరితే అక్రమ అరెస్ట్‌లకు పాల్పడటం విడ్డూరంగా ఉందని మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షులు కనవేన శ్రీనివాస్ విమర్శించారు. పెండింగ్ బిల్లుల కోసం చేపట్టిన ఛలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమ నేపథ్యంలో మంథని పోలీసులు పలువురు సర్పంచ్‌లను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కనవేన శ్రీనివాస్ మాట్లాడుతూ రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాలను పట్టించుకోకుండా ఎలాంటి అభివృద్ధి చేయలేదని విమర్శి ంచారు. తమకు రావాల్సిన బిల్లుల కోసం ఎన్నిసార్లు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని, చివరకు ఛలో అసెంబ్లీ ముట్టడికి శ్రీకారం చుడితే అక్రమంగా అరెస్ట్‌లకు పాల్పడతోందని ఆయన అన్నారు. అభివృద్ధి, సంక్షేమంపై నిర్లక్ష్యం చేస్తున్న ప్రజాప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు వస్తాయని ఆయన అన్నారు. పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో గాజులపల్లి సర్పంచ్ కరెంగుల సుధాకర్. మల్లేపల్లి మాజీ సర్పంచ్ ఎరుకల తిరుపతమ్మ రవి ఉన్నారు.

# బొప్పాయిని వీటితో కలిపి తింటే....



బొప్పాయి తినడం ఆరోగ్యానికి చాలా మంచిది. ఇందులో విటమిన్లు, ఫైబర్, అనేక పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా చర్మాన్ని కూడా కాంతివంతం చేస్తుంది. అయితే బొప్పాయిని కొన్ని ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే అది విషపూరితంగా మారే ప్రమాదం ఉంది. నిమ్మకాయ లేదా సిట్రస్ పండ్లు: బొప్పాయిని నిమ్మకాయ, నారింజ, లేదా ఇతర సిట్రస్ పండ్లతో కలిపి తినడం చాలామంది చేసే సాధారణ పొరపాటు. ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది గ్యాస్, అసిడిటీ, కడుపు నొప్పి, గుండెల్లో మంట వంటి సమస్యలకు దారితీస్తుంది. గర్భిణీ స్త్రీలు ఈ కలయికను పూర్తిగా నివారించడం మంచిది. ఎందుకంటే ఇది శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలను కూడా ప్రభావితం చేయవచ్చు.దోసకాయలు – టమాటాలు: బొప్పాయిని దోసకాయ, టమాటా వంటి కూరగాయలతో కలిపి తినకూడదు. బొప్పాయిలో పపైన్ అనే ఒక ప్రత్యేక ఎంజైమ్ ఉంటుంది. ఇది ప్రోటీన్లను జీర్ణం చేయడానికి సహాయపడుతుంది. కానీ దోసకాయ, టమాటాలలో వేరే ఎంజైమ్‌లు, ఫైబర్ ఉంటాయి. వీటిని కలిపి తినడం వల్ల జీర్ణక్రియకు ఆటంకం ఏర్పడి ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలు వస్తాయి.

ఈ రెండింటినీ కలిపి తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతుంది. ఇది గ్యాస్, అసిడిటీ, కడుపు నొప్పి, గుండెల్లో మంట వంటి సమస్యలకు దారితీస్తుంది. పెరుగు లేదా పాలు: ఆయుర్వేదం ప్రకారం.. పండ్లు, పాలు లేదా పెరుగు కలిపి తినడం ఆరోగ్యానికి హానికరం. బొప్పాయి, పెరుగు కలిపి తీసుకోవడం వల్ల కడుపులో విషపదార్థాలు ఏర్పడతాయి. దీనివల్ల చర్మంపై దద్దుర్లు, దురద, విరేచనాలు, మలబద్ధకం వంటి కడుపు సమస్యలు వచ్చే అవకాశం ఉంది. బొప్పాయి షేక్ తయారు చేసుకోవాలనుకుంటే పాలకు బదులుగా నీటిని ఉపయోగించడం మంచిది. కాకరకాయ: కాకరకాయతో బొప్పాయిని తినడం అత్యంత ప్రమాదకరమైన కలయికలలో ఒకటి. కాకరకాయ యొక్క చేదు రుచి, బొప్పాయి యొక్క తీపి రుచి శరీరంలో ప్రతికూల ప్రభావాలను సృష్టిస్తాయి. ఇది జీర్ణక్రియ ప్రక్రియను నెమ్మది చేయడమే కాకుండా తీవ్రమైన కడుపు నొప్పి, వాంతులు లేదా విరేచనాలు వంటి సమస్యలకు దారితీయవచ్చు. తేనె: బొప్పాయి – తేనె కలిపి తీసుకోవడం వల్ల కొంతమందిలో అలెర్జీ రియాక్షన్స్ వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా పచ్చి తేనెను ఉపయోగిస్తే, అది కడుపు నొప్పి, వికారం, వాంతులు లేదా చర్మంపై దద్దుర్లకు కారణం కావచ్చు. తేనెను విడిగా తీసుకోవడం ఉత్తమం.

# ఉల్లిపాయలను తింటే క్యాన్సర్ తప్పదా?




ఉల్లిపాయ.. ఇది లేనిదే ఇంట్లో వంటచేయడమే కుదరదు. ఎందుకంటే ఉల్లిపాయను ప్రతిరోజూ ఒకటి కంటే ఎక్కువ ఆహార పదార్థాలలో ఉపయోస్తాం. చాలా ఇళ్లలో గృహిణులు ఉల్లిపాయలు లేవంటే వంటచేయడమే మానేస్తారు. అలా ఉంటుంది వాటి క్రేజ్. కానీ ఈ ఉల్లిపాయల్లో కొన్నింటిని తినడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ప్రతిరోజూ ఏదో ఒక ఆహారంలో మనం ఉల్లిపాయను ఉపయోగిస్తాం. ఇవి లేకుండా కూరగాయాలు చేస్తే అసలు టేస్ట్ ఉండదు. చాలా ఇళ్లలో, గృహిణులు ఉల్లిపాయలు లేకుండా వంట చేయమంటే అస్సలూ కుదరదని మొహం మీదే చెప్పేస్తారు. అలా ఉంటుంది

వీటి క్రేజ్ మరీ. అయితే కొన్ని సార్లు ఉల్లిపాయలపై నల్ల మచ్చలు రావడం, లేదా బూజు పట్టడం జరుగుతుంది. అలాంటి వాటిని తినడం ఆరోగ్యానికి చాలా హానికరమని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. అవును మీరు విన్నది నిజమే వీటిని తినడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయో తెలిస్తే.. అలాంటి వాటిని తినడం మీరు ఇప్పుడే మానేస్తారు. పోషకాహార నిపుణుల ప్రకారం..

కొందరు ఉల్లిపాయలో దెబ్బతిన్న భాగాన్ని, అంటే నల్ల మచ్చలు ఉన్న ప్రాంతాన్ని తొలగించి, మిగిలిన భాగాన్ని మాత్రమే ఉపయోగిస్తారు. కానీ ఇలా చేయడం చాలా పెద్ద తప్పు. ఈ రకమైన బూజు ఎక్కువగా ఉల్లిపాయ లోపలి భాగంలో మాత్రమే కనిపిస్తుంది. దీనిని గుర్తించడం చాలా కష్టం అని వారు చెప్తున్నారు. పోషకాహార నిపుణురాలు ప్రకారం, నల్ల మచ్చలు లేదా బూజు ఉన్న ఉల్లిపాయలను ఎప్పుడూ ఉపయోగించకూడదు. ఇవి మైకోటాక్సిన్ అనే రకమైన టాక్సిన్‌ను ఉత్పత్తి చేస్తాయి, ఇది మానవ శరీరంపై ప్రతికూల ప్రభావాలను చూపుతుంది. అటువంటి ఉల్లిపాయలను తినడం వల్ల ఆహార అలెర్జీలు, వాంతులు, విరేచనాలు, కడుపు నొప్పి వంటి సమస్యలు వస్తాయి. అవే కాకుండా వాటి వల్ల క్యాన్సర్, కాలేయ క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధులు కూడా వచ్చే అవకాశం ఉందని ఆమె చెబుతున్నారు. కాబట్టి వాటిని శుభ్రంచేసి వినియోగించడం కన్నా.. పడేయడం బెస్ట్ అని నిపుణులు చెబుతున్నారు. మనం ఇలాంటి సమస్యల నుంచి దూరంగా ఉండాలనుకుంటే ఎప్పుడూ ఫ్రెష్‌గా ఉండే ఉల్లిపాయలు వినియోగించాలి. అవి టైప్ 2 డయాబెటిస్‌కు ప్రయోజనకరంగా ఉంటాయి. అలాగే రక్తపోటును నియంత్రించడంలోనూ సహాయపడతాయి. వేసవి ఎండలో బయటకు వెళ్ళే ముందు ఉల్లిపాయలు తినడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. అలాగే హీట్ స్ట్రోక్ ఉపశమనం లభిస్తుంది. ఎందుకంటే ఇది శరీర ఉష్ణోగ్రతను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఉల్లిపాయలపై నల్ల మచ్చలు లేదా బూజు రాకుండా ఉండటానికి వాటిని సరిగ్గా నిల్వ చేయడం చాలా ముఖ్యం. చాలా మంది మళ్లీ మళ్లీ ఎవరు కొంటారని.. ఒకేసారి బల్క్‌లో కొని ఇంట్లో పెట్టుకుంటారు. ఇలా ఒకే దగ్గర ఎక్కువ మొత్తంలో నిల్వ చేయడం ద్వారా నల్ల మచ్చలు, బూజూ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి మీకు అవసరమైన ఉల్లిపాలయను అప్పుడే తెచ్చుకొండి. అలాగే మీరు తెచ్చిన ఉల్లిపాయల్ని చల్లని, తేమగా ఉండే ప్రదేశాల్లో ఉంచకండి.


# రుచి కోసమనినిమ్మరసం వీటితో కలిపి తిన్నారో..!



నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఆహారంలో తీసుకోవల్సిన ముఖ్యమైన పదార్థాల్లో కూడా నిమ్మ ఒకటి. చాలా మందికి నిమ్మకాయ లేకుండా భోజనం అసంపూర్ణంగా అనిపిస్తుంది. నిమ్మరసం వేడి వేడి ఆహారంలో అలా చిలికించి తింటే ఆ రుచే వేరు. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, నిర్విషీకరణ లక్షణాలు ఉంటాయి. నిమ్మకాయ ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. ఆహారంలో తీసుకోవల్సిన ముఖ్యమైన పదార్థాల్లో కూడా నిమ్మ ఒకటి. చాలా మందికి నిమ్మకాయ లేకుండా భోజనం అసంపూర్ణంగా అనిపిస్తుంది. నిమ్మరసం వేడి వేడి ఆహారంలో అలా చిలికించి తింటే ఆ రుచే వేరు. నిమ్మకాయలో విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు, నిర్విషీకరణ లక్షణాలు ఉంటాయి. నిమ్మ తినడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మ రంగు కూడా మెరుగుపడుతుంది. ముఖ్యంగా, బరువు తగ్గడానికి నిమ్మకాయ కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. నిమ్మ ఆరోగ్యానికి ఎంత మేలు చేసినప్పటికీ..

దీన్ని కొన్ని ఆహార పదార్థాలతో కలిపి తీసుకుంటే విషపూరితం అవుతుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఇది అలెర్జీలు, గ్యాస్, చర్మ సమస్యలను కలిగిస్తుంది. నిమ్మకాయను పాలు, పాల ఉత్పత్తులతో కలిపి మర్చిపోయి కూడా తినకూడదు. దీనివల్ల జీర్ణ సమస్యలు వస్తాయి. పాలు, నిమ్మకాయను కలిపి తినడం వల్ల కూడా గ్యాస్ సమస్యలు వస్తాయి. గుడ్లు ప్రోటీన్ కు మంచి మూలం. అయితే గుడ్లు, నిమ్మకాయను ఎప్పుడూ కలిపి తినకూడదు. ఇది అనేక తీవ్రమైన కడుపు సమస్యలను కలిగిస్తుంది.


# బాదంతో మెదడుకు పదును..



బాదం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ సూపర్ ఫుడ్ మన మెదడుకు పదును పెట్టడమే కాకుండా మన చర్మాన్ని మెరిసేలా చేస్తుంది.చిన్నప్పుడు మన అమ్మమ్మలు, అమ్మలు రోజూ ఉదయాన్నే నానబెట్టిన బాదంపప్పులు తినమని బలవంతం చేసేవారు. ఇవి తింటే చదువు బాగా వస్తుంది, అన్నీ గుర్తుంటాయి అని చెప్పేవారు. ఇవి కేవలం మాటలే కాదు. మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేసేవి. అవును.. బాదంపప్పులు మన ఆరోగ్యానికి చాలా మంచివి. వాటిలో ప్రోటీన్లు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. వాటిని నానబెట్టి తింటే ప్రయోజనాలు రెట్టింపు అవుతాయి.బాదంలో విటమిన్ ఇ, మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవన్నీ మన మెదడుకు చాలా అవసరం. రోజూ 4-5 నానబెట్టిన బాదంపప్పులు తింటే జ్ఞాపకశక్తి పెరుగుతుంది. చదువుకునే వారికి ఇది చాలా ఉపయోగపడుతుంది. బాదంపప్పులో ఫైబర్ ఎక్కువగా ఉంటుంది.

నానబెట్టిన బాదంలో ఉండే ఎంజైమ్‌లు ఆహారం త్వరగా జీర్ణమయ్యేలా చేస్తాయి. దీనివల్ల మలబద్ధకం, గ్యాస్ వంటి సమస్యలు తగ్గుతాయి. బరువు తగ్గాలనుకునేవారికి నానబెట్టిన బాదంపప్పులు ఒక అద్భుతమైన ఆహారం. ఇందులో ఉండే ఫైబర్ కారణంగా ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది, దాంతో అతిగా తినడం తగ్గుతుంది. అంతేకాకుండా ఇది మన జీవక్రియను వేగవంతం చేస్తుంది. ఇది బరువు తగ్గడంలో సహాయపడుతుంది. నానబెట్టిన బాదంపప్పులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మన రోగనిరోధక శక్తి పెరుగుతుంది. బాదంలో ఉండే ఖనిజాలు, విటమిన్లు మన శరీరాన్ని వైరల్ వ్యాధుల నుంచి కాపాడతాయి. మీరు రోజంతా అలసిపోయినట్లు, నీరసంగా ఉన్నట్లయితే ఉదయం పూట నానబెట్టిన బాదం తినడం మంచిది. ఇందులో ఉండే పోషకాలు రోజంతా మిమ్మల్ని శక్తివంతంగా ఉంచుతాయి. బాదంపప్పులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ ఇ చర్మంపై ముడతలు, సన్నని గీతలను తగ్గిస్తాయి. దీనివల్ల చర్మం సహజంగా మెరుస్తుంది. అలాగే ఇందులో ఉండే ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, మెగ్నీషియం జుట్టును పొడవుగా, బలంగా, మరియు నల్లగా పెంచడంలో సహాయపడతాయి. నానబెట్టిన బాదంపప్పులు తినడం వల్ల జుట్టు మెరిసేలా ఉంటుంది.

# మటన్ ఎక్కువగా తింటున్నారా...!



ఎర్ర మాంసం పోషకాలతో సమృద్ధిగా ఉన్నప్పటికీ దానిని అధికంగా తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలు ఆరోగ్య సమస్యలు తెస్తాయి. ఇటీవలి పరిశోధనలు ఇది గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్,

క్యాన్సర్ వంటి తీవ్రమైన వ్యాధుల ప్రమాదాన్ని పెంచుతుందని హెచ్చరించాయి. మటన్ అంటే చాలామందికి ఇష్టమైన ఆహారం. దాని రుచి, పోషకాల కారణంగా దీనిని ఎక్కువగా తింటుంటారు. కానీ ఎర్ర మాంసాన్ని దానిని అతిగా తీసుకుంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిశోధనలు

ఈ విషయంలో మరింత ఆందోళన కలిగించే విషయాలను వెల్లడించాయి. గొడ్డు మాంసం, దూడ మాంసం, పంది మాంసం, గొర్రె, మేక మాంసం వంటి జంతువుల నుండి వచ్చే మాంసాన్ని ఎర్ర మాంసం అంటారు. దీనికి ఎరుపు రంగు రావడానికి కారణం మయోగ్లోబిన్ అనే ప్రోటీన్. ఎర్ర మాంసంలో విటమిన్ బి12, ఐరన్, జింక్, బి-విటమిన్లు వంటి ఎన్నో ముఖ్యమైన పోషకాలు ఉన్నాయి. ఇది శరీరానికి సులభంగా లభించే అధిక-నాణ్యత ప్రోటీన్‌కు కూడా మంచి మూలం. సుమారు 28 గ్రాములు మాంసంలో 7 గ్రాముల ప్రోటీన్ ఉంటుంది. అందుకే ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా దీనిని అప్పుడప్పుడు తీసుకోవడం మంచిది. పోషకాలు ఉన్నప్పటికీ ఎర్ర మాంసాన్ని వారానికి ఒకసారి మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసాలైన హామ్, బేకన్, సలామీ వంటి వాటిలో సంతృప్త కొవ్వులు, సోడియం ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు, టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని పెంచుతాయి. గుండె జబ్బులు: ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం పరిశోధన ప్రకారం.. రోజుకు 50 గ్రాముల ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం తినేవారిలో గుండె జబ్బుల ప్రమాదం 18 శాతం పెరుగుతుంది. డయాబెటిస్: ది లాన్సెట్ డయాబెటిస్ అండ్ ఎండోక్రినాలజీ పత్రికలో ప్రచురించిన ఒక అధ్యయనం ప్రకారం.. రోజుకు రెండు ముక్కల హామ్ వంటి ప్రాసెస్ చేసిన మాంసం తినడం వల్ల టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 15 శాతం పెరుగుతుంది. కొలెస్ట్రాల్: ఎర్ర మాంసం శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిని పెంచుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని మరింత పెంచుతుంది. క్యాన్సర్: ప్రపంచ ఆరోగ్య సంస్థ ఎర్ర మాంసాన్ని గ్రూప్ 2ఎ క్యాన్సర్ కారకంగా వర్గీకరించింది. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం, కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్లతో ముడిపడి ఉందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఎర్ర మాంసం పోషకాలను అందిస్తున్నప్పటికీ దానిని మితంగా మాత్రమే తీసుకోవడం మంచిది. మటన్ అంటే చాలామందికి ఇష్టమైన ఆహారం. దాని రుచి, పోషకాల కారణంగా దీనిని ఎక్కువగా తింటుంటారు. కానీ ఎర్ర మాంసాన్ని దానిని అతిగా తీసుకుంటే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవల జరిగిన కొన్ని పరిశోధనలు ఈ విషయంలో మరింత ఆందోళన కలిగించే విషయాలను వెల్లడించాయి. ప్రాసెస్ చేసిన మాంసాలను వీలైనంత వరకు దూరం పెట్టాలి. ఆరోగ్యకరమైన జీవితం కోసం సమతుల్య ఆహారం తీసుకోవడం, తాజా మాంసాన్ని ఎంచుకోవడం, శారీరక శ్రమ చేయడం అవసరం.

# అరటిని ఈ ఒక్కటి కలిపి తినండి..



శరీరానికి బలాన్నిచ్చే అరటిపండు, సుగంధ ద్రవ్యాల రాణి నల్ల మిరియాలు. ఈ రెండింటిని కలిపి తింటే ఏం జరుగుతుందో తెలుసా? చాలామంది రోజుకో అరటిపండు తినడం వల్ల కలిగే ప్రయోజనాల గురించి మాత్రమే ఆలోచిస్తారు. కానీ దానిపై కొద్దిగా నల్ల మిరియాల పొడి చల్లి తింటే అద్భుతమైన ఆరోగ్య లాభాలుంటాయి. ఈ కలయిక మీ ఆరోగ్యాన్ని ఎలా మెరుగుపరుస్తుందో నిపుణుల మాటల్లో తెలుసుకుందాం. మన వంటింట్లో లభించే కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు పోషకాల నిధి. వాటిని

సరైన విధంగా, సరైన సమయంలో తింటే అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. అరటిపండు, నల్ల మిరియాలు రెండూ శరీరానికి చాలా ఉపయోగకరమైనవి. అరటిపండు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది, శరీరాన్ని బలపరుస్తుంది. నల్ల మిరియాలు ఆయుర్వేదంలో ఔషధంలా భావిస్తారు. రోజూ ఒక అరటిపండును నల్ల

మిరియాల పొడితో కలిపి తింటే ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో ఇప్పుడు చూద్దాం. ఈ సమాచారం డైటీషియన్ నందిని అందించారు. జీర్ణక్రియ మెరుగుపడుతుంది: అరటిపండులోని పీచుపదార్థం, నల్ల మిరియాలలో ఉండే పైపెరిన్ జీర్ణ ఎంజైమ్‌లను చురుకుగా మారుస్తాయి. దీనివల్ల ఆహారం త్వరగా జీర్ణమవుతుంది. గ్యాస్, అసిడిటీ, ఉబ్బరం లాంటి సమస్యలు తగ్గుతాయి.

కలయికతో రోగనిరోధక శక్తి పెరుగుతుంది: అరటిపండులో విటమిన్ సి, నల్ల మిరియాలలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఈ రెండింటిని కలిపి తీసుకుంటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. రుతువులవల్ల వచ్చే వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది.బరువు తగ్గడానికి సహాయం: అరటిపండులోని పీచుపదార్థం ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్న భావన కలిగిస్తుంది. దీనివల్ల అతిగా తినకుండా ఉంటారు. నల్ల మిరియాలు జీవక్రియను వేగవంతం చేస్తాయి. ఈ రెండూ బరువు తగ్గడానికి సహాయపడతాయి. గుండె ఆరోగ్యానికి మంచిది: అరటిపండులోని పొటాషియం రక్తపోటును అదుపులో ఉంచుతుంది. నల్ల మిరియాలు రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. వీటిని కలిపి తినడం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుంది.

# హాలిడే సీజన్‌లో అమెరికాను వణికిస్తున్న డెవిన్ మంచు తుపాను..



## 1,800 విమానాలు రద్దు

అమెరికాలో ప్రస్తుతం హాలిడే సీజన్ నడుస్తోంది. క్రిస్మస్, న్యూఇయర్ సందర్భంగా విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు సెలవులు ఉన్నాయి. దీనికి తోడు శీతాకాలం కావడంతో విపరీతంగా మంచు పడుతోంది. దీంతో ప్రజలు హాలిడేను ఎంజాయ్ చేసేందుకు ఇతర ప్రాంతాలకు తరలివెళ్తున్నాయి. అయితే, ఈ సెలవుల వేళ వింటర్ స్టార్మ్ బీభత్సం సృష్టిస్తున్నాయి. అమెరికాలోని ఈశాన్య రాష్ట్రాలను 'డెవిన్' అనే భారీ మంచు తుపాను అతలాకుతలం చేస్తోంది. క్రిస్మస్ పండుగ ముగిసిన వెంటనే విరుచుకుపడటంతో ప్రయాణ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. ఈ తుపాను కారణంగా దాదాపు 1,800కిపైగా విమానాలు రద్దయ్యాయి. 10 వేల విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ప్రకారం.. సాయంత్రం 4 గంటల సమయానికి దేశవ్యాప్తంగా 1,802 విమానాలు రద్దుకాగా, 22,349 ఆలస్యంగా నడుస్తున్నాయి. దీంతో న్యూయార్క్‌లోని జాన్ ఎఫ్.కెన్నెడీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు, లాగ్వార్డియా విమానాశ్రయం, డెట్రాయిట్ మెట్రోపాలిటన్ వేన్ కౌంటీ విమానాశ్రయం సహా ఈశాన్య, మిడ్‌వెస్ట్‌లోని విమానాశ్రయాల్లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జెట్‌బ్లూ ఎయిర్‌లైన్స్ ఒక్కటే తన షెడ్యూల్‌లో 22 శాతం అంటే సుమారు 225కు పైగా విమానాలను రద్దు చేసింది. ఇతర ప్రధాన విమానయాన సంస్థలు కూడా వందలాది సర్వీసులను నిలిపివేశాయి. డెల్టా ఎయిర్‌లైన్స్ 186 విమానాలను, రిపబ్లిక్ ఎయిర్‌వేస్ 155 విమానాలను, అమెరికన్ ఎయిర్‌లైన్స్ 96, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ 82 విమానాలను రద్దు చేసింది. తుపాను ప్రభావం న్యూయార్క్ నగరంతో పాటు లాంగ్ ఐలాండ్, కనెక్టికట్, పెన్సిల్వేనియా, ఉత్తర న్యూజెర్సీ ప్రాంతాలపై అధికంగా ఉంది. జాతీయ వాతావరణ విభాగం సుమారు 2.3 కోట్ల మందికి వింటర్ స్టార్మ్ హెచ్చరికలు జారీ చేసింది. న్యూయార్క్ నగరంలో 4 నుంచి 8 అంగుళాల మంచు కురుస్తుందని, ఇతర ప్రాంతాల్లో అడుగు వరకు హిమపాతం నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈశాన్య ప్రాంతంలో చాలా వరకు మంచు, తుపాను హెచ్చరికలు జారీ చేసింది.

# బాధిత కుటుంబాలకు అండగా ఉన్న ఎమ్మెల్యే వస్త్ర వ్యాపారస్తులు



**గోదావరిఖని,తెలంగాణ దిశ :**శివాజీ నగర్ వస్త్ర వ్యాపారుల మరియు బుక్క దుకాణాల, ఫ్లవర్ మర్చంట్ దారుల పత్రికా సమావేశం శివాజీ నగర్ మున్సిపల్ కాంప్లెక్స్ లో గోదావరిఖని పట్టణ ప్రాంతంలోని శివాజీ నగర్‌కు చెందిన బట్టల వ్యాపారస్తులు ఈరోజు ఒక ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాకూర్ తమకు అందించిన అభివృద్ధి, సహకారం, అలాగే ఇచ్చిన హామీలను పూర్తిగా నెరవేర్చిన విధానాన్ని ప్రశంసించారు. వ్యాపారస్తులు మాట్లాడుతూ - ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఎప్పుడూ, ఎవరికీ, ఎలాంటి అన్యాయం చేయలేదని స్పష్టం చేశారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా శివాజీ నగర్ ప్రాంతంలో రోడ్ల విస్తరణ, మౌలిక వసతుల అభివృద్ధి కోసం తమ షాపులు తొలగించాల్సి వచ్చినప్పటికీ, తమ జీవనాధారాన్ని దృష్టిలో పెట్టుకుని ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాకు పూర్తి న్యాయం చేశారని తెలిపారు. షాపులు తొలగించిన వెంటనే వ్యాపారస్తులు ఇబ్బందులు పడకుండా, షాపింగ్ కాంప్లెక్స్‌లో ప్రత్యామ్నాయంగా షాపులు కేటాయించి మమ్మల్ని ఆదుకున్నారని, ఇది ఆయన ప్రజాప్రతినిధిగా చూపిన బాధ్యతాయుతమైన నాయకత్వానికి నిదర్శనమని వారు అన్నారు. అభివృద్ధి జరుగుతున్నా ప్రజల ఉపాధి దెబ్బతినకూడదన్న దృఢ సంకల్పంతో ఎమ్మెల్యే పనిచేస్తున్నారని కొనియాడారు. అలాగే గోదావరిఖని పట్టణంలోని ప్రతి ఒక్క వ్యాపారస్తుడికి అండగా నిలుస్తూ, వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ముందుంటారని వ్యాపారస్తులు స్పష్టంగా పేర్కొన్నారు. వ్యాపార వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే ప్రతి మంచి నిర్ణయంలో ఎమ్మెల్యే పాత్ర కీలకమని తెలిపారు.ఈ సందర్భంగా శివాజీ నగర్ బట్టల వ్యాపారస్తులు ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ, భవిష్యత్తులో కూడా ఇలాగే ప్రజల పక్షాన నిలబడి అభివృద్ధిని కొనసాగించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమం లో బట్టల శివాజీ నగర్ బట్టల వ్యాపార సంఘం అధ్యక్షులు నమని సదయ్య, వంగ దేవేందర్, పి అంజయ్య, బూర్ల సతీష్, గోలి రంగన్న, ఆడెపు శెంకర్, ఎం రాజమల్లు, ఎం రమేష్, వంగ నవీన్, గజర్ల అరుణ్, కె సంపత్, టీ రాజమౌళి, మురళి, రాజమౌళి, సత్యం, ఎం శ్రీనివాస్, గట్టయ్య, బుక్క దుకాణ అధ్యక్షులు చింతల సదానందం ఫ్లవర్ మర్చంట్ అసోసియేషన్ మెంబర్ సతీష్ తదితరులుపాల్గొన్నారు.

# మేకపాటి స్థానంలో కొత్త నేత

**నెల్లూరు,తెలంగాణ దిశ :** జగన్మోహన్ రెడ్డిని రాజకీయంగా చాలా కుటుంబాలు అండగా నిలిచాయి. ముఖ్యంగా రెడ్డి సామాజిక వర్గం నేతలు తమ సొంత పార్టీలను వదిలి జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేశారు. కానీ ఆ పార్టీలో అనుకున్న స్థాయిలో గుర్తింపు సాధించుకోలేకపోయారు. దీంతో ఒక్కొక్కరు బయటకు వెళ్ళిపోయారు. ఇప్పుడు మరో పొలిటికల్ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని వీడేందుకు సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం నడుస్తోంది. అటు జగన్మోహన్ రెడ్డి సైతం ఆ ఫ్యామిలీని లైట్ తీసుకోవడంతో ఇక పార్టీలో ఉండడం భావ్యం కాదని భావిస్తున్నట్లు సమాచారం. వారి స్థానంలో ప్రత్యామ్నాయ నేతను బరిలోదించేందుకు అప్పుడే అన్వేషణ ప్రారంభించారట జగన్మోహన్ రెడ్డి. దీంతో ఆ ఫ్యామిలీ వ్యాపార కార్యకలాపాలకు పరిమితమైంది. ఎన్నికల ముంగిట ఏదో ఒక నిర్ణయం తీసుకోవాలని చూస్తోంది.కాంగ్రెస్ పార్టీని విభేదించి జగన్మోహన్ రెడ్డి సొంతంగా పార్టీని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలోనే నెల్లూరు జిల్లాకు చెందిన మేకపాటి ఫ్యామిలీ చేరింది. మేకపాటి రాజమోహన్ రెడ్డి సీనియర్ పొలిటీషియన్. 1989 నుంచి ఆయన ఎంపీ గానే పోటీ చేస్తూ గెలుస్తూ వచ్చారు. జగన్మోహన్ రెడ్డి తో పాటు ఎంపీ పదవిని వదులుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. 2012 ఉప ఎన్నికల్లో గెలిచారు కూడా. 2014 ఎన్నికల్లో సైతం ఆయనే సత్తా చాటారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి. అయితే 2019 ఎన్నికల్లో ప్రత్యక్ష రాజకీయాల నుంచి పక్కకు తప్పుకున్నారు. ఆయన బదులు కుమారుడు గౌతమ్ రెడ్డి రంగంలోకి వచ్చారు. జగన్మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహిత నేత గౌతమ్ రెడ్డి. ఆయన వల్లే ఆ ఫ్యామిలీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరింది. 2019 ఎన్నికల్లో గౌతంరెడ్డి అసెంబ్లీకి పోటీ చేసి గెలిచారు. జగన్మోహన్ రెడ్డి మంత్రివర్గంలో స్థానం దక్కించుకున్నారు. అయితే 2022లో చనిపోయారు గౌతమ్ రెడ్డి. ఆయన స్థానంలో తమ్ముడు విక్రమ్ రెడ్డి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ జగన్ మంత్రిగా అవకాశం ఇవ్వలేదు. అప్పటినుంచి మేకపాటి ఫ్యామిలీలో ఒక రకమైన అసంతృప్తి ఉన్నట్లు తెలుస్తోంది.గత ఎన్నికలకు ముందు మేకపాటి రాజమోహన్ రెడ్డి సోదరుడు చంద్రశేఖర్ రెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పారు. దీంతో మేకపాటి రాజమోహన్ రెడ్డి తో పాటు ఆయన కుమారుడు విక్రమ్ రెడ్డికి టికెట్ ఇచ్చారు జగన్. అయితే నెల్లూరు జిల్లాలో నేతలంతా బయటకు వెళ్లిపోవడంతోనే జగన్ మేకపాటి ఫ్యామిలీకి రెండో టిక్కెట్ కల్పించారు. కానీ 2024 ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత రాజమోహన్ రెడ్డి కి ప్రాధాన్యత తగ్గించారు జగన్మోహన్ రెడ్డి. ఈ నేపథ్యంలో వ్యాపారాలు పై దృష్టి పెట్టింది మేకపాటి ఫ్యామిలీ. ఇటీవల నెల్లూరు వచ్చిన రాజమోహన్ రెడ్డి పార్టీ అధినేత తీరు మార్చుకోవాలని సూచిస్తూ విలువైన సలహాలు ఇచ్చారు. అయితే దీనిని సానుకూలంగా తీసుకోకుండా ప్రతికూలంగా తీసుకున్నట్లు తెలుస్తోంది జగన్మోహన్ రెడ్డి. అందుకే ఆయన స్థానంలో టిడిపిలో ఉన్న ఒక బడా నేతను ఆకర్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం నడుస్తోంది. ప్రస్తుతం టిడిపిలో ఎంపీగా ఉన్న ఓ నేతను నెల్లూరుకు రప్పించి ఎంపీగా పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. అతని కుమారుడికి అసెంబ్లీ టికెట్ ఇస్తానని కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. మొత్తానికైతే ఈ పరిస్థితులు చూస్తుంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఆ సీనియర్ నేత దూరమైనట్టే.

# రహస్య జీవోల సంగతేంటీ

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణలో ప్రభుత్వ ఉత్తర్వుల గోప్యతపై హైకోర్టు మరోసారి సీరియస్ అయ్యింది. అన్ని జీవోలు, సర్క్యులర్లు, నోటిఫికేషన్లను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సమాచార హక్కు చట్టం ప్రకారం ప్రజలకు తెలియాల్సిన నిర్ణయాలను దాచిపెట్టడం రాజ్యాంగ విరుద్ధమని స్పష్టం చేసింది. అయితే, ప్రభుత్వాలు మారుతున్నా జీవోలను పబ్లిక్ డొమైన్ లో పెట్టకుండా దాచిపెట్టే సంప్రదాయం మాత్రం మారడం లేదు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో మొదలైన ఈ బ్లాంక్ నంబర్ల సంస్కృతి, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వంలోనూ కొనసాగుతుండటం పారదర్శకతపై పెద్ద ప్రశ్నగా మిగిలింది. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జీవోల గోప్యత గరిష్ట స్థాయికి చేరిందని చెప్పవచ్చు. ముఖ్యంగా భూ కేటాయింపులు, నిధుల మళ్లింపు, వివాదాస్పద నిర్ణయాలకు సంబంధించిన వేలాది జీవోలను ఆన్‌లైన్ లో అందుబాటులో ఉంచకుండా 'కాన్ఫిడెన్షియల్' కేటగిరీలో దాచేశారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, ఇది చీకటి పాలన అని, తాము అధికారంలోకి వస్తే ప్రతి జీవోను ప్రజల ముందు ఉంచుతామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరీ ఆశాజనకంగా ఏమీ లేదని గణాంకాలు చెబుతున్నాయి.తాజా గణాంకాల ప్రకారం, గత 13 నెలల్లో విడుదలైన 19,000 పైచిలుకు జీవోలలో కేవలం 17-18 శాతం మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉన్నాయి. అంటే దాదాపు 82 శాతం జీవోలు ఇంకా రహస్య ఫోల్డర్లలోనే మగ్గుతున్నాయి. గత ప్రభుత్వంలో 50-60 శాతం దాచిపెట్టేవారని అనుకుంటే, ప్రస్తుత గణాంకాలు అంతకంటే ఎక్కువగా ఉండటం విస్మయానికి గురిచేస్తోంది. బదిలీలు, ఆర్థిక వ్యయం వంటి అంశాలను ప్రజల కంట పడకుండా ఉంచేందుకు రహస్య జీవోల అస్త్రాన్ని ప్రభుత్వాలు వాడుకుంటున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 ప్రకారం, ప్రభుత్వాలు తమ నిర్ణయాలను స్వచ్ఛందంగా బహిర్గతం చేయాలి. కానీ తెలంగాణలో మాత్రం జీవో కాపీ కావాలంటే కోర్టులకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక ప్రజా ధనం, ప్రజా ప్రయోజనం ముడిపడి ఉంటాయి.

అటువంటప్పుడు ఆ నిర్ణయాలను దాచాల్సిన అవసరం ఏమిటి అనే ప్రశ్న సామాన్యుడిలో ఉదయిస్తోంది. పారదర్శకత అనేది కేవలం ఎన్నికల నినాదంగానే మిగిలిపోతుందా అని పౌర సమాజం నిలదీస్తోందిహైకోర్టు ఆదేశాల నేపథ్యంలోనైనా ప్రస్తుత ప్రభుత్వం తన తీరు మార్చుకుంటుందా అనేది వేచి చూడాలి. గత ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపుతూ అధికారంలోకి వచ్చిన వారు, అవే తప్పులను కొనసాగించడం అంటే ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయడమే అవుతుందన్న అభిప్రాయం వినిపిస్తోంది. మరి ప్రభుత్వం అన్నింటినీ పబ్లిక్ కు అందుబాటులో ఉంచుతుందా?

# మళ్లీ యూరియా కష్టాలు మొదలు

## క్యూలు కడుతున్న రైతులు



వరంగల్,తెలంగాణ దిశ :ఎరువుల కష్టాలు తీరడం లేదు. యాప్ వచ్చినా యూరియా కష్టాలు షరామామూలు అన్నట్లుగా సాగుతున్నయి. చల్లని చలిలో రైతులు క్యూలో చెప్పులు, కర్రలు పెట్టి పడిగాపులు పడుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు ప్రభుత్వ తీరుపై మండిప డుతున్నారు. యూరియా ఇప్పించండని వేడుకుంటున్నారు. వానకాలంలో యూరియా కోసం గంటల తరబడి క్యూలోనే ఉన్న అన్నదాతలకు 'ఫర్టిలైజర్ బుకింగ్ యాప్'తో చిక్కుల్లోకి నెట్టింది. రైతులకు ఎరువులను అందుబాటులో ఉంచాల్సింది పోయి, ఎరువుల కష్టాలను మరింత ఎక్కువ చేసేలా రూపొందించిన యాప్ అందుబాటులోకి తెచ్చింది.ఈ యాప్‌ను ప్రారంభించిన తొలిరోజునే పనిచేయకపోవడం గమనార్హం. దీంతో రైతులకు యాసంగిలో కష్టాలు తప్పేలా లేవనే వాదనలు వినిపిస్తున్నాయి. అసలే అంతంత మాత్రం చదువులతో సేద్యం చేసుకుంటున్న రైతన్నకు మొబైల్ యాప్ ద్వారా ఎరువులను బుక్ చేసుకోవాలంటే కత్తి మీద సాములాంటిదేనని పేర్కొంటున్నారు. గతంలో ఇచ్చినట్లే ఎరువులను పాత పద్ధతిలోనే ఇవ్వాలని రైతులు కోరుతుతన్నారు. ఫోన్ల గురించి మాకు తెలియదు. మేము ఇప్పటికీ చిన్న ఫోన్లనే వాడుతున్నం. ఎప్పుడు, ఎలా బుక్ చేసుకోవాలో మాకు తెలియదు. వానకాలంలో ఇచ్చినట్లు గోదాంలో పైసలు కట్టి తీసుకపోయినట్లు ఇస్తే బాగుంటుందని సూచిస్తున్నారు.సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నప్పటికీ చాలా మంది రైతుల వద్ద ఆండ్రాయిడ్ ఫోన్లు లేవు. ఇప్పటికీ కీ ప్యాడ్ ఫోన్లనే ఉపయోగిస్తున్నారు. ఒకవేళ ఆండ్రాయిడ్ ఫోన్ ఉన్నా యాప్‌లో ఎరువులు బుక్ చేయడం , ఓటీపీలు చెప్పడంపై ఏ మాత్రం అవగాహన లేదు. ఈసారి యాసంగికి కూడా కష్టాలు తప్పేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు. చాలా మంది రైతులకు ఎరువుల షాపుల పేర్లు కూడా తెలియని పరిస్థితి. యాప్‌లో ఎరువులను బుక్ చేసుకుంటే ఊరు, దుకాణం పేరు నమోదై ఉంటుంది. ఏ షాపు పేరు బుక్ చేస్తే అదే దుకాణానికి వెళ్లి ఐటీ నంబర్ చెబితేనే ఎరువులు ఇస్తారు. లేకపోతే ఎరువులు తీసుకోవడం కుదరదు. అది 15 రోజులు దాటితే ఎరువుల బుకింగ్ క్యాన్సిల్ అవుతుంది. ఇలాంటి సమస్యలను రైతులు ఎలా అధిగమిస్తారని, లేక పాత పద్ధతిని ఎంచుకుంటారా అనేది వేచిచూడాలిమరి. పంటల వివరాలు నమోదు చేసుకొని రైతులకు సాగుపై అవగాహన కల్పించాల్సిన వ్యవసాయ శాఖకు ప్రభుత్వం కొత్త టాస్క్ అప్పజెప్పింది.

యాప్‌లపై అవగాహన లేని రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయ విస్తీర్ణాధికారులదే. డీలర్ షాపుల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసి యాప్‌లపై అవగాహన కల్పించాలని చెప్పడంతో అధికారులు నానా ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇప్పటికే ఏఈవోలకు జిల్లా అధికారులు అవగాహన కల్పించే పనిలో పడ్డారు. మారుమూల గ్రామాల్లో రైతులకు అసలు సమాచారం చేరుతుందా, ఆ గ్రామాలకు ఏఈవోలు వెళ్తారా అనేది పెద్ద ప్రశ్న. కామారెడ్డి జిల్లాలో 4 లక్షల 4 వేల 525 ఎకరాలు రైతులు సాగుచేస్తున్నట్లు వ్యవసాయ శాఖ వద్ద లెక్కలు ఉన్నాయి. దీంతోపాటు 40 వేల మంది కౌలు రైతులు కూడా సాగుచేస్తున్నట్లు అంచనా వేశారు. యాసంగి పంటలకు సకాలంలో రైతులకు ఎరువులు అందుతాయో లేదా చూడాల్సిందే మరి.

# జిల్లాలో 40కి కిలో టమాటా

అనంతపురం,తెలంగాణ దిశ: జిల్లాలో టమోటా ధరలు ఆశాజనకంగా పలుకుతున్నాయి. వారం రోజులుగా కక్కలపల్లి టమోటా మార్కెట్లో కిలో గరిష్ఠ ధర రూ.40కిపైగానే పలుకుతున్నాయి. గరిష్ఠ ధర రూ.46 పలికింది. దిగుబడులు తగ్గిపోవడమే ధరల పెరుగుదలకు కారణమన్న అభిప్రాయాలు మార్కెట్ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. జిల్లా నుంచి ఎగుమతి అయ్యే ప్రాంతాల్లోనూ టమోటా దిగుబడులు అంతంతమాత్రంగానే ఉండటంతో ప్రస్తుతం టమోటాకు ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది. కక్కలపల్లి మార్కెట్‌కు రెండు, మూడు వేల బాక్సులకు మించి దిగుబడులు రావట్లేదు. గతంలో ఒక్కో మండీకి పదివేలకుపైగానే టమోటా బాక్సులు వచ్చేవి. మార్కెట్‌కు 1,350 టన్నుల కాయలు మాత్రమే వచ్చాయి. కిలో గరిష్ఠంగా రూ.46తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.20 పలుకగా.. సరాసరి రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి తెలిపారు.

# భారీగా పెరిగిన బంగారం ధరలు

## రెండున్నర లక్షలకు చేరిన కిలో వెండి



హైదరాబాద్: వెండి, బంగారం ధరలు మరోమారు భారీగా పెరిగాయి. వరుసగా రోజూ వేలల్లో పెరుగూత పోతున్నాయి. తాజాగా కిలో వెండి ధర రూ.2.50 లక్షలకు చేరింది. నెల రోజుల్లోనే దాదాపు రూ.80 వేలు పెరగడం గమనార్హం. 10 గ్రాముల బంగారం 24క్యారెట్ల ధర రూ.1.43లక్షలు, 22 క్యారెట్లధర రూ.1.31 లక్షలుగా ఉంది. అమెరికాలో ద్రవ్యోల్బణం అంచనాల కంటే తగ్గిన నేపథ్యంలో, తదుపరి సమీక్షలోనూ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లలో కోత విధిస్తుందనే అంచనాలు పెరిగాయి.ఆర్థిక అనిశ్చితులు తొలగకపోవడంతో, సుస్థిరమనే భావనతో విలువైన బంగారం, వెండి పైకి పెట్టుబడులు తరలివస్తూనే ఉన్నాయి. గిరాకీకి తగ్గట్లు వెండి సరఫరా లేదని, అందువల్ల ధరలు పెరుగుతాయనే అంచనాలను దృష్టిలోపెట్టుకొని ఎక్కువమంది వెండిపై పెట్టుబడులు పెడుతున్నారని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక ఈ ఏడాది ఇప్పటికే పుత్తడి ధర దాదాపు 70 శాతానికి పైగా ఎగబాకింది. 1979 తర్వాత ఇదే అతిపెద్ద వార్షిక లాభమని నిపుణులు చెబుతున్నారు. 2026 ప్రారంభంలోనూ ఈ లోహాల ధరల పరుగు కొనసాగొచ్చని అంచనా వేశారు. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు ఈ పెరుగుదలకు కారణమవుతున్నాయి.

# బీ ఆర్ ఎస్ లో చేరికలు



## సొంతగూటికి 3వ వార్డు కౌన్సిలర్

## పార్టీలో చేరిన సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు

జయశంకర్,తెలంగాణ దిశ :జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బిఆర్ఎస్ పార్టీ అర్బన్ ప్రెసిడెంట్ కటకం జనార్దన్ అధ్యక్షతన నిర్వహించిన భూపాలపల్లి పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి, వరంగల్ జిల్లా జడ్పీ మాజీ ఛైర్పర్సన్ మరియు భూపాలపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు గండ్ర జ్యోతి హాజరయ్యారు. ఈ సందర్భంగా 3వ వార్డు మాజీ కౌన్సిలర్ పిల్లలమర్రి శారద నారాయణ మరియు సేవాలాల్ సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజు ఈ రోజు మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణా రెడ్డి గారి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ వీడి బిఆర్ఎస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా వారికీ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో రానున్న మున్సిపాలిటీ ఎన్నికలే ప్రధాన అజెండాగా, ప్రతి వార్డు స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో అమలైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల ఆశలను ప్రభుత్వం నిరాశపరుస్తోందని, హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి హక్కులను కాపాడడంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పార్టీ ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సమావేశం ద్వారా పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపుతూ, రానున్న ఎన్నికల్లో భూపాలపల్లి మున్సిపాలిటీపై బీఆర్ఎస్ జెండా ఎగరవేయాలనే సంకల్పాన్ని కార్యకర్తలు వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ల్యాబ్ టెక్నీషియన్ల పోస్టులలో నకిలీలు?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య సేవల నియామక బోర్డు చేపట్టిన ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఇప్పుడు తీవ్ర దుమారం రేపుతోంది. ముఖ్యంగా ఫేక్ ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్ల ద్వారా అనర్హులు వెయిటేజీ మార్కులు పొంది, అర్హులైన అభ్యర్థుల అవకాశాలను దెబ్బతీశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి.. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఉద్యోగాలను కొల్లగొట్టే ప్రయత్నం జరుగుతోందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గతేడాది సెప్టెంబర్ 11న 1,284 ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. మొత్తం 100 మార్కులలో 80 మార్కులు రాత పరీక్షకు.. మిగిలిన 20 మార్కులు ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారికి వెయిటేజీగా కేటాయించారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వారికి ప్రతి ఆరు నెలలకు 2.5 పాయింట్లు, ఇతర ప్రాంతాల్లో పనిచేసే వారికి 2 పాయింట్ల చొప్పున గరిష్టంగా 20 పాయింట్లు ఇస్తారు. అభ్యర్థి గతంలో ఖచ్చితంగా 'ల్యాబ్ టెక్నీషియన్' హోదాలోనే ప్రభుత్వ ఆస్పత్రులు లేదా విభాగాల్లో పనిచేసి ఉండాలి. వేరే ఇతర హోదాల్లో పనిచేసిన వారికి ఈ వెయిటేజీ వర్తించదు.ఈ నెల 20 నుండి 22 వరకు జరిగిన కౌన్సెలింగ్ ప్రక్రియలో అసలు అక్రమాలు బయటపడ్డాయి. ఏడు జోన్ల పరిధిలో (చార్మినార్, జోగులాంబ, యాదాద్రి, రాజన్న, భద్రాద్రి, బాసర, కాళేశ్వరం) అభ్యర్థుల జాబితాను పరిశీలించిన బాధితులుగ్భ్రాంతికి గురయ్యారు. ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలల్లో పనిచేసే కాంట్రాక్టు లెక్చరర్లు, ఆర్టీపీసీఆర్ సైంటిస్టులు, టీ-హబ్ మేనేజర్లు, ల్యాబ్ అటెండెంట్లు సైతం ల్యాబ్ టెక్నీషియన్లుగా తప్పుడు సర్వీస్ సర్టిఫికెట్లు సృష్టించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. నోటిఫికేషన్‌లో సూచించిన ఫార్మాట్‌లో ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన బాధ్యత ఉన్నత అధికారులదే. అయితే.. క్షేత్రస్థాయి లో వాస్తవాలను పరిశీలించకుండానే కొందరు అధికారులు ఈ ఫేక్ సర్టిఫికెట్లను జారీ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కోవిడ్ సమయంలో తాత్కాలికంగా పనిచేసిన వారు కూడా నిబంధనలకు విరుద్ధంగా సర్వీస్ మార్కులు పొందినట్లు అభ్యర్థులు ఆధారాలతో సహా నియామక బోర్డుకు ఫిర్యాదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయా లని, వెంటనే జాబితాను ప్రక్షాళన చేసి అర్హులకు మాత్రమే నియామక పత్రాలు అందజేయాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

## 37 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులకు..

# సంక్షేమ పథకాలు కట్..?

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసేందుకు సిద్ధమైంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో అనర్హులను గుర్తించి తొలగించే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించింది.ముఖ్యంగా పేదలకు ఉద్దేశించిన పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా మారిన విషయం ఉన్నతాధికారుల పరిశీలనలో బయటపడింది. అర్హత లేని వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.ఇదే క్రమంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశముందని రేవంత్ సర్కార్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పేదలకు అందించే పథకాల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు కూడా లబ్ధిదారులుగా ఉన్నట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. దీంతో వారిని గుర్తించి లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది..ప్రభుత్వ ఖజానా నుంచి ప్రతి నెలా జీతాలు తీసుకుంటున్న కొంతమంది ఉద్యోగులు నిరుపే దలకు అందాల్సిన పింఛన్లు, ఇండ్లు, చివరకు ఉపాధి హామీ కూలీ డబ్బులను కూడా పొందుతున్నట్టు అధికారిక లెక్కల్లో తేలింది. దీనికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన నివేదిక ప్రకారం.. దాదాపు 37 వేల మందికి పైగా ఉద్యోగులు వివిధ పథకాల్లో లబ్ధి పొందుతున్నట్టు బయటపడింది. వీరిలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో పాటు రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. ఈ జాబితాలో చిరుద్యోగులే కాదు.. ఉన్నత స్థాయి ఉద్యోగులు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చా యనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.ప్రభుత్వం పేదలకోసం అందిస్తున్న పథకాల్లో ఏఏ పథకంలో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు.. వారిలో ఎంతమంది కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది, ఎంత మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నారనే వివరాలను ఉన్నతాధికా రులు ఇప్పటికే సేకరించారు. ఆ డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్ స్కేల్, స్టేట్ స్కల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను తక్షణమే నిలిపివేయాలని నివేదికలో స్పష్టంగా పేర్కొ న్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హులని తేల్చిచెప్పారు.పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లు(47), ఎస్‌జీటీ అండ్ టీజీటీలు (71), పబ్లిక్ హెల్త్ మేనేజర్లు, లెక్చరర్లు, చివరకు సివిల్ అసిస్టెంట్ సర్జన్లు(5), జ్యుడీషియల్ మెజిస్ట్రేట్లు కూడా జాబితాలో ఉండడం గమనార్హం. వీరి పేర్లు లబ్ధిదారుల జాబితాలోకి ఎలా వచ్చాయనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇటీవల ఉద్యోగులందరి ఆధార్ డేటా తీసుకున్న ప్రభుత్వం.. వాటిని ప్రభుత్వ పథకాలతో సరిపోల్చింది. దీంతో ఈ లెక్కలు బయటపడ్డాయి. ఇంకొన్ని స్కీములలో కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఉంటారని సెక్రటేరియెట్? వర్గాలు చెప్తున్నాయి. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'చేయూత' పథకంలోనే అత్యధికంగా ఉద్యోగులు లబ్ధి పొందుతున్నారు. అధికా రుల నివేదిక ప్రకారం..ఈ ఒక్క పథకంలోనేఏకంగా 15,704 మంది ఉద్యోగుల వివరాలు లబ్ధిదారుల జాబితాతో సరిపోలాయి. వీరిలో అత్యధికంగా 8,273 మంది గౌరవ వేతనం తీసుకుంటున్న చిరుద్యో గులు ఉండగా, 3,202 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది, 2,939 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు ఉన్నారు. విచిత్రమేమిటంటే.. ప్రభుత్వం నుంచి పూర్తి స్థాయి జీతాలు తీసుకునే స్టేట్ స్కేల్ రెగ్యులర్ ఉద్యోగులు 478 మంది, గ్రాంట్ ఇన్ ఎయిడ్ ఉద్యోగులు 338 మంది కూడా ఈ పథకం కింద డబ్బులు తీసుకుంటున్నట్టు తేలింది. ఇందులో అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, జూనియర్ లెక్చరర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వంటి అనేక రకాల ఉద్యోగులు ఉన్నారు. గ్రామాల్లో పనులు దొరక్క ఇబ్బంది పడే కూలీల కోసం ఉద్దేశించిన ఉపాధి హామీ పథకంలోనూ11,210 మంది ప్రభుత్వ ఉద్యోగులు లబ్ధి పొందుతున్నట్టు గుర్తించారు. ఇందులో సింహభాగం 7,077 మంది గౌరవ వేతనం తీసుకునే సిబ్బంది ఉన్నారు. అలాగే 2,214 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు, 1,124 మంది అవుట్‌సోర్సింగ్ సిబ్బంది ఉపాధి హామీ డబ్బులు పొందుతున్నారు. మొత్తం 9,135 మంది ఉద్యోగులు ఇండ్లు పొందినట్టు లేదా మంజూరు చేయించుకు న్నట్టు డేటాలో తేలింది. వీరిలో 5,177 మంది హానరోరియం సిబ్బంది కాగా, 2,256 మంది కాంట్రాక్ట్, 1,371 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఉన్నారు. ఇక 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పథకం కింద 1,444 మంది ఉద్యోగులు లబ్ధి పొందుతుండగా, వారిలోనూ హానరోరియం (954), కాంట్రాక్ట్(328) సిబ్బందే అధికంగా ఉన్నారు. డేటా ఆధారంగా ఉన్నతాధికారులు ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేశారు. గ్రాంట్ ఇన్ ఎయిడ్, మినిమమ్ టైమ్‌స్కేల్, స్టేట్ స్కేల్ కింద జీతాలు తీసుకుంటున్న రెగ్యులర్ ఉద్యోగులకు, టైమ్ స్కేల్ ఉద్యోగులకు.. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను "తక్షణమే నిలిపివేయాలి" అని నివేదికలో స్పష్టంగా పేర్కొన్నారు. వీరు నిబంధనల ప్రకారం అనర్హుల ని తేల్చిచెప్పారు.

# పలాస చేరుకున్న అభ్యుదయం సైకిల్ యాత్ర

**పలాస,తెలంగాణ దిశ :** గంజాయి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత, ప్రజలను చైతన్య పరిచేందుకు 25 మంది పోలీసు సిబ్బంది ఉత్తరాంధ్రలోని 6 జిల్లాల పరిధిలో 1200 కిలోమీటర్ల మేర సైకిల్ యాత్ర చేపడు తున్నారు. అభ్యుదయం పేరిట చేపడుతున్న ఈ సైకిల్ యాత్ర శ్రీకాకుళం జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లాలోని పలాసలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఇందిరా చౌక్ నుంచి రైల్వే గ్రౌండ్ వరకు సాగిన ర్యాలీకి ఎమ్మెల్యే గౌతు శిరీష ముఖ్య ఆహ్వానితులుగా హాజరయ్యారు. అభ్యుదయం యాత్రకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు బ్రో.. భవిష్యత్తు ముద్దు బ్రో పేరిట పోలీసు శాఖ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం అన్నారు. అందులో భాగంగా సైకిల్ యాత్రను చేపట్టామన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు.
తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల అలవాట్లు,వారి ప్రవర్తన పట్లదృష్టి సారించాలన్నారు. ఒకవేళ వారు మత్తు పదార్థాల బారినపడితే వారు కోలుకునేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. అదే విధంగా మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి సమాచారా న్ని 1972 నెంబరుకు అందించాలన్నారు. తద్వారా వారికి మత్తు నుంచి విముక్తి కల్పించే వీలు కలుగుతుందన్నారు. తమ సంకల్పంలో ప్రజలంతా భాగస్వాములై డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం సాకారం చేయాలని పిలుపు నిచ్చారు. పాయకరావుపేట నుంచి ఇచ్చాపురం వరకు సాగుతున్న అభ్యుద యం యాత్ర ఈ నెల 29న ఇచ్ఛాపురంలో ముగియాల్సి ఉందని శ్రీకాకుళం ఎస్పీ కెవి మహేశ్వర్ రెడ్డి ఇటీవల తెలిపారు.

# భీమిలీలో వారసుడికి లైన్ క్లియర్





**విశాఖపట్టణం,తెలంగాణ దిశ :** గంటా శ్రీనివాసరావు. టీడీపీలోనూ, ప్రజారాజ్యం లోనూ, కాంగ్రెస్‌లోనూ..ఎక్కడున్నా కీలక పదవుల్లో కొనసాగారు. రెండు దశాబ్దాలకుపైగా రాజకీయాల్లో ఉన్న ఆయన ఓటమి ఎరుగని నేతగా పేరు సంపాదించారు. అయితే 2024 ఎన్నికల్లో భీమిలి నుంచి పోటీ చేసి గెలిచిన గంటా మళ్లీ మంత్రి కావాలనుకున్నారు. కానీ ఆ ఆశ నెరవేరడం లేదు. గంటాకు మంత్రి పదవి దక్కక పోవడానికి చాలా రీజన్స్ ఉన్నాయని చర్చ జరుగుతోంది.సామాజిక వర్గ సమీకరణాల్లో భాగంగా గంటాకు అమాత్య యోగం దక్కలేదని కొందరు చెబుతున్నా, అసలు అధిష్టానమే ఆయన్ను పక్కన పెట్టిందన్న టాక్ ఉంది. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీకి అంటీముట్టనట్లుగా వ్యవహరించారని ..చంద్రబాబు అరెస్ట్‌పై గంటా రియాక్ట్ కాలేదని ఆయనపై పార్టీ అధిష్టానం అసంతృప్తిగా ఉందట.టీడీపీని వీడి వైసీపీలో చేరేందుకు గంటా శ్రీనివాసరావు ప్రయత్నాలు చేశారని అప్పట్లో ప్రచారం బాగా జరిగింది. దీంతో అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ అధిష్టానం గంటాను పక్కన పెట్టేసిందన్న ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ కీలకంగా ఉన్న మంత్రి లోకేశ్ కూడా గంటాను దగ్గరకు రానివ్వడం లేదట. 2014 హయాంలో చంద్రబాబు కాకుండా లోకేశ్ నాయకత్వాన్ని అప్పట్లో గంటా మనస్ఫూర్తిగా స్వాగతించలేకపోగా, ఎడమొహం పెడమొహంగా ఉండేవారట. ఈ పరిస్థితులన్నింటినీ గమనించిన లోకేశ్ ఇప్పుడు గంటాకు మంత్రి పదవి ఇవ్వలేదనే టాక్ నడుస్తోంది.గతంలో రెండుసార్లు మంత్రి, ఓసారి ఎంపీగా..విశాఖలో బుగ్గకారులో రయ్ రయ్‌మంటూ తన హవాను నడిపించిన గంటా, ఇప్పుడు కేవలం ఎమ్మెల్యేగా పరిమితం కాలేకపోతున్నారట. పోనీ తర్వాత ఎప్పుడైనా మంత్రివర్గ విస్తరణ జరిగితే ఛాన్స్ వస్తుందా అంటే అదీ డౌటేనని తెలిసిపోయిందట.తన సహచరులైన అయ్యన పాత్రుడు స్పీకర్‌గా, ఒకప్పుడు తాను ఎమ్మెల్యే సీటు ఇప్పించిన ఎమ్మెల్యే వంగలపూడి అనిత హోంమంత్రిగా, గాజువాక ఎమ్మెల్యేగా ఉన్న పల్లా శ్రీనివాసరావు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా బుగ్గ కార్లలో తిరుగుతుంటే..తాను మాత్రం ఎమ్మెల్యేగా మిగిలిపోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. దీంతో గంటా తన పొలిటికల్ బ్రెయిన్‌కు మళ్లీ ఇప్పుడు పని చెప్పారట. అందుకే ఇక రాజకీయాలకు ఫుల్ స్టాప్ పెట్టి, తన కుమారుడు రవితేజను పొలిటికల్ స్క్రీన్ మీదకు తీసుకురావాలని తహతహలాడుతున్నారని గంటా క్లోజ్ సర్కిల్స్ టాక్.నిజానికి తన కుమారుడు రవి తేజను సిల్వర్ స్క్రీన్‌పై చూడాలని గంటా కోరిక. హీరోగా సినీ రంగంలో నిలబెట్టాలని గంటా ప్రయత్నాలు చేశారు. జయదేవ్ పేరిట గతంలో రవితేజ హీరోగా సినిమా తీశారు. మెగాస్టార్ చిరంజీవితో పాటు పలువురు సినీ ప్రముఖులతో తనకున్న సన్నిహిత సంబంధాలు కలిసి వస్తాయని భావించారట. అయితే ఆ జయదేవ్ మూవీ మొదటి షోతోనే ముగిసిపోవడంతో, ఇక పొలిటికల్ ఫీల్డే బెటర్ అనే నిర్ణయానికి వచ్చారట. అప్పటి నుంచి గంటాకు తోడుగా అడపాదడపా మాత్రమే రాజకీయాల్లో రవితేజ కనిపించేవారు.ఇప్పుడు సీన్ మారింది. గంటా కంటే ఎక్కువగా ఆయన కుమారుడు రవితేజనే భీమిలిలో ఎక్కువగా కనిపిస్తున్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పెంచినా, తల్లికి వందనం నిధులు మంజూరు చేసినా, అన్నదాత సుఖీభవ, ఫ్రీ గ్యాస్, ఉచిత బస్ వంటి పథకాల్ని ప్రారంభించినా సరే రవితేజ యాక్టీవ్‌గా భీమిలి నియోజకవర్గంలో తిరుగుతున్నారు. అలాగే నియోజకవర్గానికి సంబంధించిన కీలక అంశాలపై రవితేజనే అధికారులతో మాట్లాడుతున్నారు. ఇటీవల ఉత్తరాంధ్ర టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రవితేజ దగ్గరుండి ప్రచారం చేశారు.అలాగే భీమిలి టీడీపీ, జనసేన క్యాడర్‌లో తన పట్టు పెంచుకునేందుకు, అందరికీ అందుబాటులో ఉండే ప్రయత్నం చేస్తున్నారు రవితేజ. ఇదంతా చూస్తున్నవారికి గంటా స్కెచ్ ఏంటో అర్థమైపోయిందట. వచ్చే ఎన్నికల నాటికి తాను ఎంపీగానో మరో పదవికి వెళ్లిపోయి, తన కుమారుడుని లోకేశ్ టీమ్‌లో చేర్పించి మంత్రిని చేయాలనే ఎత్తుగడలో భాగంగానే..భీమిలిలో రవితేజను యాక్టీవ్ చేశారని అంటున్నారు. ఇటు గంటా కుమారుడిగా, అటు మంత్రి నారాయణ అల్లుడిగా కూడా రవితేజకు రాజకీయ బలగం కలిసి రాబోతుందన్న టాక్ వినిపిస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి రవితేజను అసెంబ్లీకి పంపి తర్వాత మంత్రిని చేయడం పక్కా అని గంటా అనుచరులు కూడా లెక్కలు వేసుకుంటున్నారట. మరి గంటా శ్రీనివాసరావు స్కెచ్ వర్కౌట్ అవుతుందో లేదో చూడాలి మరి.

# ఇండియాలో కొత్తగా 3 విమానయాన సంస్థలు



న్యూఢిల్లీ,: ఇండిగో సంస్థ చేసిన నిర్వాకం వల్ల దేశంలో ఇబ్బందికరమైన వాతావరణం ఏర్పడింది. దేశంలోని అన్ని విమానాశ్రయాలలో ప్రయాణికులు గంటల తరబడి పడికాపులు కాయాల్సి వచ్చింది. దీంతో భారత్ పరువు పోయింది. ఫలితంగా భారత ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. ప్రతిపక్షాల అయితే కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టాయి. ఒకానొక దశలో పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చిందిఇండిగో సంస్థ ఇచ్చిన షాక్ నుంచి కేంద్ర ప్రభుత్వం త్వరగానే మేల్కొంది. నేపథ్యంలో దేశంలో మరో రెండు విమాన సంస్థలకు పౌర విమానయాన శాఖ అనుమతులు ఇచ్చింది.
ఆల్ హింద్ ఎయిర్, ఫ్లై ఎక్స్ ప్రెస్ సంస్థలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. పౌర విమానయాన శాఖ నుంచి ఈ సంస్థలకు నిరభ్యంతర పత్రాలు కూడా మంజూరయ్యాయి. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మరో సంస్థ శంక్ ఎయిర్ అనే సంస్థకు కూడా ఇప్పటికే కేంద్రం నిరంతర పత్రం ఇచ్చింది. వచ్చేయడాల నుంచి ఆ సంస్థ కార్యకలాపాలు మొదలు పెట్టనుంది.ఇటీవల దేశీయ ఇండిగో సంస్థలో సంక్షోభం ఏర్పడింది. దీంతో దేశవ్యాప్తంగా కొద్ది రోజులపాటు విమాన సర్వీసులు నిలిచిపోయాయి. దీంతో అనేకమంది ప్రయాణికులు విమానాశ్రయాలలో చిక్కుకుపోయారు. ఈ వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్లో సుదీర్ఘంగా ప్రసంగించారు. విమానయాన రంగంలో ఏ సంస్థ పూర్తి స్థాయిలో ఆధిపత్యం కొనసాగించడానికి తాను ఆస్కారం ఇవ్వడం లేదని.. ఇంకా చాలా సంస్థలను ఈ రంగంలోకి ఆహ్వానిస్తున్నట్టు ప్రకటించారు. అంతేకాదు కొత్త సంస్థలు కార్యకలాపాలు సాగించడానికి ఇదే అనుకూలమైన సందర్భం అని ఆయన పేర్కొన్నారు. ఇక మన దేశంలోని విమానయాన రంగంలో ఇండిగో, ఎయిర్ ఇండియా సంస్థలు 90% వాటా కలిగి ఉన్నాయి. ఇందులో ఇండిగో కే 65% వాటా ఉండడం విశేషం.
కేంద్రం తీసుకొచ్చిన నిబంధనల నేపథ్యంలో ఇండిగో సంస్థ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సర్వీసులను అప్పటికప్పుడు రద్దు చేసింది. కొన్ని సర్వీస్లను దారి మళ్ళించింది. దీంతో దేశవ్యాప్తంగా అనేక విమానాశ్రయాలలో ప్రయాణికులు నరకం చూశారు. సర్వీసులు నిలిచిపోవడంతో ప్రయాణికులు విమానాశ్రయాలకే పరిమితం కావలసి వచ్చింది. ఈ పరిణామం నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్ర నిర్ణయం పట్ల ప్రయాణికులనుంచి సానుకూల స్పందన వ్యక్తం అవుతుంది. ఈ నిర్ణయం ఎప్పుడో తీసుకొని ఉంటే బాగుండేదని ప్రయాణికులు పేర్కొంటున్నారు.

# తమ్మినేనికి చెక్...



శ్రీకాకుళం,తెలంగాణ దిశ : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రమశిక్షణ కట్టు దాటు తోంది. నేతల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ల విషయంలో నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రకంపనలు రేపుతున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో తాజాగా సీనియర్ నేత ధర్మాన కృష్ణ దాస్ చేసిన ప్రకటన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ఇబ్బందుల్లో పెట్టినట్టు ఉంది. సీనియర్ నేతగా ఉన్న ధర్మాన కృష్ణ దాస్.. ఆ జిల్లా పార్టీ అధ్యక్షుడు కూడా. అయితే వచ్చే ఎన్నికల్లో తమ్మినేని పోటీ విషయంలో ఆయన చేసిన ప్రకటన మాత్రం పొలిటికల్ వర్గాల్లో హీట్ రేపుతోంది. వచ్చే ఎన్నికల్లో తమ్మినేని సీతారామును తప్పించి మరొకరిని పోటీ చేయిస్తామన్న ధర్మాన కృష్ణ దాస్ ప్రకటనపై దువ్వాడ శ్రీనివాస్ విభిన్న ప్రకటనలు చేస్తున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తున్నారు.కొద్దిరోజుల కిందట దువ్వాడ శ్రీనివాస్ పై సస్పెన్షన్ వేటు వేసింది హై కమాండ్. వ్యక్తిగత కుటుంబ వివాదాలతో ఆయనపై వేటు వేయాల్సి వచ్చింది. అయితే దీని వెనుక ధర్మాన బ్రదర్స్ కుట్ర ఉంది అన్నది దువ్వాడ చేస్తున్న ఆరోపణ. కింజరాపు కుటుంబంతో కలిపి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని సర్వనాశనం చేస్తున్నారని ఆరోపణ చేస్తున్నారు. తన ఓటమి వెనుక ధర్మాన కుటుంబ హస్తం ఉందని కూడా సంచలన ఆరోపణలు చేశారు. ఈ పరిస్థితుల్లో ధర్మాన బ్రదర్స్ పై పెద్ద యుద్ధమే ప్రకటించారు దువ్వాడ. దానికి కాళింగ సామాజిక వర్గం ను అడ్డం పెట్టుకొని రాజకీయం చేయడం మొదలుపెట్టారు. ఆ సామాజిక వర్గం ద్వారానే తిరిగి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి రీఎంట్రీ ఇవ్వడానికి ఆయన చేయని ప్రయత్నం అంటూ లేదు.అసెంబ్లీ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఆమదాలవలస నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా ఉండేవారు. ఆయనను తప్పించి యువకుడైన చింతాడ రవికుమార్ కు ఆ బాధ్యతలు అప్పగించారు జగన్మోహన్ రెడ్డి. అప్పటినుంచి తమ్మినేని సీతారాం కూడా మనస్థాపంతో ఉంటూ వస్తున్నారు. ఆయన సైతం కాళింగ సామాజిక వర్గానికి చెందిన నేత. ఇటువంటి పరిస్థితుల్లో టెక్కలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయ సమావేశానికి జిల్లా అధ్యక్షుడి హోదాలో హాజరయ్యారు కృష్ణదాస్. ఈ క్రమంలో వచ్చే పార్లమెంటరీ ఎన్నికల్లో రామ్మోహన్ నాయుడుకు ధీటుగా సరైన అభ్యర్థిని రంగంలోకి దించుతామని చెప్పుకొచ్చారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఎంపీగా తమ్మినేని పోటీ చేస్తారని ప్రచారం నడిచింది. అయితే ఆయనకు పెద్దల సభకు కానీ ఎమ్మెల్సీ పదవి గానీ ఇస్తామని కృష్ణ దాస్ చెప్పడం దువ్వాడ శ్రీనివాస్ ఆయుధంగా మలుచుకున్నారు. కాళింగ సామాజిక వర్గాన్ని తరుపైకి తెస్తూ.. కింజరాపు, ధర్మాన బ్రదర్స్ ను కేడి బ్రదర్స్ తో పోల్చారు. వచ్చే ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి నేరుగా హెచ్చరించలేదు. కానీ ధర్మాన బ్రదర్స్ కు హెచ్చరించడం ద్వారా హై కమాండ్ కు పరోక్ష సంకేతాలు పంపగలిగారు.

# నూతన సర్పంచ్ లకు శిక్షణ



**జయశంకర్,తెలంగాణ దిశ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని పుష్ప కన్వెన్షన్ లో భూపాలపల్లి నియోజకవర్గ నూతన సర్పంచుల మరియు ఉప సర్పం చుల శిక్షణ శిబిరానికి ముఖ్య అతిథులుగా స్థానిక భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్య నారాయణ రావుతో పాల్గొని నూతనంగా ఎన్నికైన సర్పంచు లకూ మరియు ఉపసర్పంచులకు గ్రామంలో ప్రతి ఒక్కరికి అందుబా టులో ఉంటూ ,ప్రజలకు సేవలందిస్తూ , కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు తెలియజేస్తూ వారికి అందేవిధంగా పనిచేయాలని,ప్రజా స్వామ్యంలో ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా పనిచేయాలని అలాగే గ్రామాన్ని అభివృద్ధి బాటలో నడిపే విధంగా పాలకవర్గం ప్రజలతో మమేకమై పనిచేయాలని శిబిరంలో పాల్గొన్నసర్పంచులకు,ఉప సర్పంచులకూ వారి సూచనల ను అందించిన తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య గారు,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, పిసిసి సభ్యులు చల్లూరు మధు,సీనియర్ నాయకులు రామ్ నరసింహా రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీదేవి, కిష్టయ్య ,వివిధ మండలాల అధ్యక్షులు నూతనసర్పంచులు,ఉపసర్పంచులు మరియు పార్టీ నాయకులు , కార్యకర్తలు తదితరుల పాల్గొన్నారు

# నటిస్తున్నానంతే.. భయపడకు



శారీరకంగా ఎన్ని రకాల సమస్యలు ఉన్నా అనుకున్న సమయానికి షూటింగులకు హాజరు కావాల్సిన పరిస్థితి సినిమా వాళ్లది. ముఖ్యంగా ఈ విషయంలో కథానాయికలు బాగా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉంటారు. తాజాగా ఓ బిడ్డకు జన్మనిచ్చిన బాలీవుడ్ భామ కియారా అద్వానీ ఈ విషయంపై ఆసక్తికరంగా మాట్లాడారు. 'నాకు ప్రెగ్నెన్సీ ఎప్పుడు ఖరారైంది? షూటింగులను ఎలా మేనేజ్ చేశాను? అనే విషయాలపై చాలామందికి పలు అనుమానాలున్నాయి.
వారందరికీ క్లారిటీ ఇవ్వాలనుకుంటున్నా. గర్భందాల్చిన ఏడో నెల వరకూ నేను నటిస్తూనే ఉన్నా. ఈ విషయం నా దర్శక, నిర్మాతలకు మాత్రమే తెలుసు. షాట్ ముగియగానే కారవాన్‌లోకి వెళ్లి, కడుపులో ఉన్న నా బిడ్డతోమాట్లాడేదాన్ని. 'కేవలం నటిస్తున్నానంతే.. భయపడకు' అంటూ నా బిడ్డకు భరోసా ఇచ్చేదాన్ని. 'వార్2'లో బికినీ సీన్‌పై కూడా చా లా వార్తలొచ్చాయి.
ఆ టైమ్‌లో నేను ప్రెగ్నెంట్ కాబట్టి, ఏఐ ద్వారా ఆ సీన్స్ మేనేజ్ చేశారని చాలా మంది రాశారు. అందులో ఏ మాత్రం నిజం లేదు. ఆఫిజిక్ నాదే. బికినీ ఫిజిక్ కోసం కఠోరమైన క్రమశిక్షణ పాటిస్తే ఆ రూపం వచ్చింది. అయితే.. ఆ సీన్స్ తీసేటప్పుడు నేను రెండో నెల గర్భిణిని. కాబట్టే తేడా కనిపించలేదు.'అంటూ చెప్పుకొచ్చింది కియారా అద్వానీ. ప్రస్తుతం 'కేజీఎఫ్'ఫేం యష్ 'టాక్సిక్' సినిమాలో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.




# ఎన్టీఆర్, నీల్ సినిమాలో తల్లిగా కాజోల్





అగ్ర హీరో ఎన్టీఆర్ నటిస్తున్న పీరియాడిక్ పానిండియా యాక్షన్ డ్రామా 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్). ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతున్నది. ఎన్టీఆర్ కెరీర్‌లోనే గుర్తుండిపోయేలా ఈ సినిమాను దర్శకుడు ప్రశాంత్‌నీల్ తెరకెక్కిస్తున్నారని మేకర్స్ చెబుతున్నారు. ఇందులో ఎన్టీఆర్ పాత్ర నెవర్ బిఫోర్ అనే స్థాయిలో ఉంటుందని తెలుస్తున్నది. కథ డిమాండ్ మేరకు ఈ సినిమా కోసమే భారీగా బరువు తగ్గారు తారక్. ఇప్పటివరకూ కర్ణాటకలోనూ విదేశాల్లోనూ కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ప్రస్తుతం భాగ్యనగరంలో చిత్రీకరణ జరుగుతున్నది. 1969 కాలంలో చైనా, బూటాన్, ఇండియా సరిహద్దు ప్రాంతాల నేపథ్యంలో ఈ కథ సాగుతుందని, తల్లి సెంటిమెంట్ ఈ సినిమాకు ప్రధాన బలమని, తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఇందులో ఎన్టీఆర్ తల్లిగా సీనియర్ బాలీవుడ్ నటి కాజోల్ నటిస్తున్నారని, అలాగే మలయాళ నటుడు టివినో థామస్ కీలక పాత్రలో కనిపించి అందర్నీ సర్‌ప్రైజ్ చేస్తారని మేకర్స్ చెబుతున్నారు. రుక్మిణీ వసంత్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీమేకర్స్ నిర్మిస్తున్న విషయం తెలిసిందే. ఈచిత్రానికి సమర్పణ: ఎన్టీఆర్ ఆర్ట్స్.


# మీనా కూతురు నైనిక ఫొటో వైరల్



సీనియర్ నటి మీనా తన వ్యక్తిగత జీవితం విషయంలో, ముఖ్యంగా తన కూతురు నైనిక ప్రైవసీ విషయంలో ఎంత జాగ్రత్తగా ఉంటారో అభిమానులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలనటిగా 'తేరి' (తెలుగులో పోలీసోడు) సినిమాతో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న నైనిక, ఆ తర్వాత వెండితెరపై చాలా అరుదుగా మాత్రమే కనిపించింది. తన కూతురు సాధారణ జీవితం గడపాలని, చదువుపై పూర్తి దృష్టి పెట్టాలని మీనా తీసుకున్న నిర్ణయమే దీనికి కారణం. ఇంతటి జాగ్రత్తలు తీసుకుంటున్న సమయంలో, తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక ఫొటో మీనా అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసింది. క్రిస్మస్ సందర్భంగా మీనా పక్కన నైనిక నిలబడి ఉన్నట్లు కనిపిస్తున్న ఆ ఫొటో నెట్టింట విస్తృతంగా షేర్ అవుతోంది. దీంతో "ఇన్ని రోజులు బయటకు రానివ్వని నైనిక ఫొటో ఇప్పుడు ఎలా లీక్ అయ్యింది?" అనే సందేహాలు మొదలయ్యాయి. నిశితంగా పరిశీలిస్తే, ప్రస్తుతం వైరల్ అవుతున్న ఫొటో ఒరిజినల్ కాదని, అది పూర్తిగా ఎడిట్ చేసిన ఫేక్ పిక్ అని స్పష్టమవుతోంది. మీనా విడిగా దిగిన ఒక తాజా ఫొటోను, నైనికకు సంబంధించిన పాత ఫొటోతో కలిపి ఎవరో కావాలని ఎడిట్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది.
ఇద్దరి హెయిర్ స్టైల్, లైటింగ్, ఫొటో క్వాలిటీ తేడాగా ఉండటం వల్ల ఇది ఫేక్ అన్న విషయం ఇట్టే అర్థమవుతోంది. ఇంకా ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. ఆ ఫొటోను షేర్ చేసిన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ నైనికదని చెప్పుకుంటున్నా, అది నిజమైన అకౌంటా? ఫేక్ అకౌంటా? అన్న దానిపై కూడా స్పష్టత లేదు. మీనా స్వయంగా బాలనటిగా కెరీర్ ప్రారంభించిన వ్యక్తి. షూటింగ్‌లు, సినిమా వాతావరణం కారణంగా తన బాల్యాన్ని, చదువును పూర్తిగా ఆస్వాదించలేక పోయానని ఆమె పలుమార్లు చెప్పుకొచ్చారు. అదే పరిస్థితి తన కూతురికి రాకూడదనే గట్టి నిర్ణయంతోనే నైనికను మీడియా, సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతున్నారు. నైనిక పుట్టినరోజులకైనా, ప్రత్యేక సందర్భాల్లోనైనా మీనా షేర్ చేసే ఫొటోలు అన్నీ పాతవే తప్ప, తాజా ఫొటోలు ఎప్పుడూ బయటపెట్టలేదు. ఇటీవల ఒక పెళ్లి వేడుకలో తీసిన గ్రూప్ ఫొటోలో మాత్రమే నైనిక కనిపించింది కానీ, సోలో ఫొటోలు మాత్రం ఎక్కడా విడుదల కాలేదు.

# సినీ నేపథ్యం లేకుండానే ఇండస్ట్రీలోకి..

# ఛాంపియన్'తో కొత్త ప్రయాణం



మలయాళ చిత్రసీమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి అనస్వర రాజన్ తాజాగా 'ఛాంపియన్' సినిమాతో తెలుగు చిత్ర పరిశ్రమలో అడుగుపెట్టింది. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది. తన పేరు 'అనస్వర'కు "నాశనం లేనిది" లేదా "అనంతమైనది" అనే అర్థం ఉందని తెలిపింది. అలానే తెలుగు ప్రేక్షకులపై ప్రశంసలు కురిపించిం ది. "తెలుగు ప్రేక్షకులు మంచి సినిమా, మంచి నటనను ఎప్పుడూ ఆదరిస్తారు. ఆ స్వీకరణ ఎంతో ప్రత్యేకం" అని చెప్పింది. 2019లో విడుదలైన మలయాళ చిత్రం 'తన్నీర్ మతన్ దినంగల్' ద్వారానే తెలుగు ప్రేక్షకుల ప్రేమను పొందానని, అప్పటి నుంచే తెలుగు సినిమాల్లో నటించాలని ఆశపడ్డానని పేర్కొంది. 'ఛాంపియన్' చిత్రం సాధారణ ప్రేమకథలకు భిన్నంగా ఉంటుందని, ఇందులో తాను పోషించిన చంద్రకళ పాత్ర తనకు కొత్త సవాలుగా నిలిచిందని అనస్వర వెల్లడించింది. ఎనిమిదో తరగతిలోనే తన తొలి సినిమా ఆడిషన్‌కు హాజరై, ఎలాంటి నటనా అనుభవం లేకుండానే ఎంపిక కావడం తనను ఆశ్చర్యానికి గురి చేసిందని గుర్తు చేసుకుంది. కేరళ లోని ఓ చిన్న గ్రామం నుంచి సినీ నేపథ్యం లేకుండానే ఇండస్ట్రీలోకి వచ్చినట్లు తెలిపినఅనస్వర, ఆడిషన్లకువెళ్లడంలోతన అక్క సహకరిం చిందని, తల్లిదండ్రుల మద్దతే తన బలమని చెప్పింది. సినిమా రంగం తనను నటిగా మాత్రమే కాకుండా వ్యక్తిగా కూడా ఎదగనిచ్చిందని ఆమె పేర్కొంది. నటన ద్వారా లభించే అడ్రినలిన్ రష్ డబ్బు, కీర్తికంటే ఎక్కువ సంతృప్తినిస్తుందని చెప్పిన అనస్వర, ప్రశంసలతో పాటు విమర్శలను కూడా స్వీకరించే స్థాయికి తాను చేరుకున్నానని తెలిపింది. అలాగే అల్లు అర్జున్ తనకు ఇష్టమైన తెలుగు హీరో అని, తెలియకుండానే తెలుగు సినిమాలపై అభిమానం పెరిగిందని చెప్పడం విశేషం. 'ఛాంపియన్'తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన అనస్వర రాజన్,తన ప్రయాణం ఇక్కడితో ఆగదని, మంచి పాత్రలతో మరింత ముందుకు వెళ్లాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది.

# శర్వానంద్ చేతుల మీదుగా 'కాగితం పడవలు' టీజర్ లాంచ్..




టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ తాజాగా 'కాగితం పడవలు' చిత్ర టీజర్‌ను లాంచ్ చేసిచిత్ర యూనిట్‌కు తన శుభాకాంక్షలు తెలియజేశారు.ఎంజీఆర్ తుకారాందర్శకత్వంలో వర్ధన్, కృషప్రియ జంటగా నటించిన ఈ చిత్రాన్ని ఎస్ఎల్ఎన్ సినీ క్రియేషన్స్, ప్రణధి క్రియేషన్స్ మరియు నవ నారాయణ సినీ క్రియేషన్స్ బ్యానర్లపై కీర్తన నరేష్, టి.ఆర్. ప్రసాద్ రెడ్డి వెంకట్రాజుల, గాయిత్రమ్మ అంజనప్ప అత్యున్నత నిర్మాణ విలువలతో నిర్మించారు. టీజర్ విడుదల సందర్భంగా శర్వానంద్ మాట్లాడుతూ.. ఎలాంటి సినీ నేపథ్యం లేకపోయినా ప్యాషన్‌తో సినిమా తీసిన దర్శకుడు తుకారాంను అభినందించారు. టీజర్ చాలా నిజాయితీగా, ఆసక్తికరంగా ఉందని, హీరో వర్ధన్ తన మొదటి సినిమా అనిపించకుండా అద్భుతంగా నటించాడని ప్రశంసించారు. "ప్రేమ నిప్పులాంటిది.. అది జీవితానికి వెలుగునిచ్చే దీపంఅవ్వచ్చు లేదా దహించే కార్చిచ్చు కావచ్చు" అనే డైలాగ్‌తో సాగిన ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. హీరో హీరోయిన్ల మధ్య కెమిస్ట్రీ, హార్ట్ టచింగ్ ఎమోషన్స్, %ూ×ూ%. నౌఫల్ రాజా అందించిన నేపథ్య సంగీతం మరియు రుద్రసాయి విజువల్స్ సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఎం. హిమ బిందు పర్యవేక్షణలో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే థియేటర్లలోవిడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన పబ్లిసిటీ పనులను పీఆర్వో తేజస్వి సజ్జా నిర్వహిస్తున్నారు.

# త్రిష కెరియర్ ను 'విశ్వంభర' పరిగెత్తిస్తుందా?



త్రిష .. దాదాపు పాతికేళ్ల కెరియర్ ను చూసిన నాయిక. తెలుగు .. తమిళ భాషల్లో స్టార్ డమ్ ను చూసిన బ్యూటీ. అలాంటి త్రిషకి ఆ మధ్య కాలంలో అవకాశాలు తగ్గుతూ వెళ్లాయి. ఆ సమయంలో ఆమె నాయికా ప్రధానమైన కథలను చేస్తూ వెళ్లింది. ఆ క్రమంలో 'రాంగీ' 'ది రోడ్' '96' వంటి సినిమాలు ఆమె కెరియర్ ను మరికాస్త ముందుకు నడిపించాయి. ఈ నేపథ్యంలోనే త్రిషను సినిమా ఫంక్షన్ కి సంబంధించిన ఒక వేదికపై చూసి అందరూ షాక్ అయ్యారు. అందుకు కారణం గతంలో కంటే ఆమె ఇప్పుడు మరింత గ్లామరస్ గా ఉండటమే. త్రిష గురించి .. ఆమె గ్లామర్ గురించి సోషల్ మీడియాలో సందడి సాగింది. దాంతో ఆమెకి మళ్లీ పెద్ద బ్యానర్ల నుంచి .. సీనియర్ స్టార్స్ సినిమాల నుంచి కాల్స్ వెళ్లడం మొదలైంది. అలా ఆమె రజనీకాంత్ కమల్ వంటి సీనియర్ స్టార్స్ సరసన..విజయ్ – అజిత్ వంటి స్టార్స్ జోడీగా మెరిసింది. గ్లామర్ పరంగా త్రిష ఆ సినిమాలకి చాలా హెల్ప్ అయింది. కానీ ఆ సినిమాలు ఆశించిన స్థాయిలో ఆడకపోవడం ఆమె అభిమానులను నిరాశ పరిచింది. ఈ క్రమంలోనే తమిళంలో ఆమె సూర్య సినిమా 'కరుప్పు'లో నటిస్తోంది. ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్న .
ఈ సినిమాకి ఆర్జే బాలాజీ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇక తెలుగులో ఆమె చిరంజీవి సరసన 'విశ్వంభర'లో కనిపించనుంది. ఈ రెండు సినిమాలు వచ్చే ఏడాదిలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. ఈ వయసులోను గ్లామర్ పరంగా మంచి మార్కులు కొట్టేసిన త్రిషకు ఇప్పుడు ఒక పెద్ద హిట్ అవసరం. ఆమె కోరుకుంటున్న విజయాన్ని 'విశ్వంభర' అందిస్తుందా? ఆమె కెరియర్ ను పరిగెత్తిస్తుందా? అనేది చూడాలి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215